హనీబీఎపి

సంపుటి 4, సంచిక 4


ఏప్రిల్ - జూన్ 2010

# పల్లెసృజన

గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక



## చెరువులకు విముక్తి కలిగిస్తున్న నర్శింహా




## స్వశక్తితో ఎదుగుతున్న మల్లేశ్

# 'హనీబీఏపి' ప్రగతి



'హనీబీఏపి' ఒక స్వచ్ఛంద సంస్థ, హనీబీ నెట్వర్క్ను ఆంధ్రప్రదేశ్లో విస్తృతం చేయడమే దీని ఉద్దేశ్యం. ఎన్.ఐ.ఎఫ్. సంస్థకు, ఆధ్రప్రదేశ్లోని మారుమూల పల్లెల్లోని గ్రామీణ శాస్త్రవేత్తలతో సంధానం చేయడం ఈ సంస్థ మూల కార్యక్రమం.

నవంబర్ 2005 లో బ్రిగేడియర్ గణేశం, డా. కె.యల్. రావు, శ్రీ పి. చంద్రకాంత్ శర్మ గార్ల సంకల్పమే ఈ సంస్థకు జన్మనిచ్చింది. 2007లో శ్రీ జాగర్లమూడి దుర్గాప్రసాద్ గారు హనీబీఏపిలో చేరడంలో ఉద్యమ ప్రగతి మరింత ఊపునందుకొంది. ప్రొఫెసర్ అనిల్ గుప్తా గారిని ఆదర్శంగా తీసుకుని వారి మహత్తర జ్ఞాన ఉద్యమాన్ని తెలుగునాట విస్తృతం చేసి, తెలుగు జాతి సృజనాత్మక శక్తిని దేశమంతా చాటి చెప్పాలనే ఆరాటంతో ప్రారంభమై 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతున్నది. స్వచ్ఛందంగా ఎంతో మంది చేతులు కలిపారు. పెద్దలు ఆశీర్వదించారు. అధికారులు చేయూత నిచ్చారు. అధికార, అనధికార సంస్థలు, వ్యక్తులు శాయశక్తులా తోడిచ్చారు. పత్రికలు, టీవీలు తగినంత కవరేజ్ని అందించాయి. అందరితోడు, శుభాకాంక్షలు ఈ స్వల్ప కాలంలో 'హనీబీఏపి' పునాదులను పటిష్టం చేశాయి.

**ఇంతవరకు హనీబీఏపి చేపట్టి సాధించిన వివిధ కార్యక్రమాలు:**

✤ 78 మంది తెలుగు ఇన్నోవేటర్లను వెతికి, వెలుగులోకి తెచ్చి, వారి ఆవిష్కరణలను, ఆలోచనలను ఎన్ఐఎఫ్లో రిజిష్టర్ లో చేయడం జరిగింది.

✤ నలుగురు ఇన్నోవేటర్ల ఆవిష్కరణలను పారిశ్రామిక వేత్తలకు అందించి, ఆర్థిక ఒప్పందం కుదుర్చడమైనది.

✤ ఒక ఆవిష్కరణ కార్యరూపం దాల్చుటకు, టెస్టింగ్కు టి.ఐ.పి.పి. ద్వారా నాలుగు లక్షల రూపాయల ఆర్థిక సహాయం.

✤ కారంచేడులో జరిగిన జాతీయ గ్రామీణ ప్రగతి ప్రదర్శనలో 28 మంది ఇన్నోవేటర్లు పాల్గొని విజయవంతం చేశారు.

✤ ఇప్పటి వరకు 12 కళాశాలల్లో స్టూడెంట్ ఇన్నోవేషన్ క్లబ్బులను ప్రారంభించడం జరిగింది..

✤ తెలుగు పల్లె జ్ఞానం దోమలను చంపే హెర్బల్ మందును ఎన్.ఐ.ఎఫ్. శాస్త్రీయంగా నిర్ధారించడం.

✤ హైదరాబాద్లో జనవరి 2010 ఉద్యాన వనశాఖ, వ్యవసాయ శాఖ సంయుక్తంగా నిర్వహించిన ప్రదర్శనలో మన ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించగా ఎంతోమంది వాటిని మెచ్చుకోవడం జరిగింది.

✤ నెల్లూరులో ఆదిశంకర విద్యా సంస్థలో 'జరిగిన టెక్నాలజీ మేళా'లో 19 మంది ఇన్నోటర్లు పాల్గొనటం జరిగింది.

✤ వెయ్యికి పైగా సాంప్రదాయ జ్ఞానాన్ని సేకరించి ఎన్.ఐ.ఎఫ్.కు పంపడం.

✤ దాదాపు తొమ్మిది మంది ఇన్నోవేటర్లకు తమ ఆలోచనలను కార్యరూపం చేయటానికి కావలసిన ఆర్థిక సహాయాన్ని అందించటం.

✤ ఇన్నోవేటర్లకు జాతీయ వ్యవసాయ పరిశోధన, సాంకేతిక విజ్ఞాన మేనేజ్మెంట్ (నారమ్) లో వివిధ 'సెమినార్ల'లో శిక్షణా కార్యక్రమాల్లో అతిథిగా పాల్గొనేట్లు చేయటం.

✤ గత నాలుగేళ్లలో 'పల్లెసృజన' త్రైమాసిక పత్రికను విజయవంతంగా ప్రచురించింది.

✤ 42 మంది 'బిట్స్ పిలాని' విద్యార్థులతో వరంగల్, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల్లోని 130 గ్రామాల్లో 'జ్ఞానశోధ' చేయడం.

✤ చింతకింది మల్లేశం ఆసు మిషన్కు, నరసింహాచారి కాలిపోయిన ట్యూబ్లైట్లను వెలిగించే పరికరానికి ప్రొవిజనల్ పేటెంట్ పొందడం.

✤ ఇష్వాక్, లింగ బ్రహ్మంల పేటెంట్ కేసులను ఫైలు చేయడం.

✤ చింతకింది మల్లేశం పరిశోధనకు గాను రాష్ట్రపతి ద్వారా ప్రథమ జాతీయ పురస్కారం.

✤ హైదరాబాద్లో జనవరిలో జరిగిన ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ లో పల్లెసృజన స్టాల్ను నిర్వహించగా అక్కడికి ఎంతోమంది సందర్శకులు స్టాల్కు విచ్చేయడం.

✤ 1 మార్చి, 2010న హైదరాబాద్లో జరిగిన నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.) ఆవిర్భావ దినోత్సవంలో రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఇన్నోవేటర్లు, అధికారులు, అనధికారుల సమ్మేళనం అందరికీ ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వడం.

✤ దేశ చరిత్రలోనే ప్రప్రథమంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో 14-20 మార్చి, 2010 జరిగిన 'ఎగ్జిబిషన్ ఆఫ్ ఇన్నోవేషన్స్' లో ఆంధ్ర ప్రదేశ్ నుంచి చింతకింది మల్లేశం, చంద్రశేఖర్ గార్లు పాల్గొనడం.

**మా కలలు :**

✤ ఏడవ ద్వైవార్షిక పోటీలకు వేయి ఎంట్రీలను ఆంధ్రప్రదేశ్ నుండి పంపడం.

✤ కనీసం నలుగురు తెలుగు గ్రామీణ ఆవిష్కర్తలకు రాష్ట్రపతి చేతులమీదుగా బహుమతి ఇప్పించడం.

✤ పల్లెజ్ఞానవేత్తల ఇన్నోవేషన్లను మార్కెట్లోకి తేవడం

✤ 'పల్లెసృజన సభ్యత్వాన్ని 10వేలకు పెంచడం.

మా కలలు నిజం కావాలంటే మీ సహకారం కావాలి. ప్రోత్సహించండి – పాల్గొనండి – ఆవిష్కరించండి.

**- బ్రిగేడియర్ పి. గణేశం,**
కో–ఆర్డినేటర్, హనీబీఏపి,
ఫోన్ : 98660 01678.

# పల్లెసృజన

సంపుటి-4 సంచిక - 4 ఏప్రిల్ - జూన్ 2010

## సంపాదకవర్గం

సంపాదకులు :

**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం**

సలహాదారులు :

**డా. కె.ఎల్. రావు**

**ప్రొ. అనిల్ గుప్త**

**డా. గీర్వాణి**

**శ్రీ పి. చంద్రకాంత్ శర్మ**

**జాగర్లమూడి దుర్గాప్రసాద్**

**శ్రీమతి అరుణ గణేశం**

**జె. శశిమోహన్**

**పల్లె వీర రాఘవ రెడ్డి**

డి.టి.పి. & డిజైనింగ్ :

**నరేంద్ర గ్రాఫిక్స్, హైదరాబాద్.**

ఫోన్ : 040- 27665655

సెల్ : 93913 75655, 800 888 5655

E-mail : narendragrafix@gmail.com

ఎడిటోరియల్ అడ్రస్ :

**పల్లెసృజన,** 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,

సికింద్రాబాద్ - 500 094.

ఫోన్ : 040-27118555

E-mail : honeybeeap@gmail.com

హనీబీఏపి గురించి, గ్రామ శాస్త్రవేత్తలపై **22** ఆగస్టు, **2010**న 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఆదివారం సప్లిమెంటరీలో కవర్‌పేజి కథనం ప్రచురితమైంది. పాఠకులు గమనించగలరు.

**- ఎడిటర్**

## ఈ సంచికలో......


- స్వశక్తితో పైకివచ్చిన గ్రామీణ స్థాయి యువ ఇన్నోవేటరు బొమ్మగాని మల్లేశం - 3
- సేవాతత్పరులకు 'సృష్టి' సన్మానం - 7
- సహజ ఎరువులు - కషాయాలు - 10
- వర్షపాతముపై అవగాహన - 12
- గుర్రపుడెక్క సమస్యనుంచి చెరువులకు విముక్తి కలిగిస్తున్న గోదాసు నర్సింహ - 16
- ఎన్.ఐ.ఎఫ్. 5వ జాతీయ పురస్కారాలు - 19
- మన ఔషధ మొక్కలు - 23
- ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి - 28


**కవర్ లోపలి పేజీల్లో :**

**హనీబీ ఎపి ప్రగతి**

**'క్రియేటివ్ మైండ్స్' మార్కెటింగ్ చేస్తున్న 'బ్రహ్మం గ్యాస్ ఇస్త్రీ పెట్టె' గురించి**

**మధ్యపేజిలో**

**ఛత్తీస్‌ఘడ్‌లో జరిగంయి 24వ శోధయాత్ర విశేషాలు.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee C/o Prof. Anil Gupta**
Indian Institute of Management
Vastrapur, Ahmedabad - 380 015. Gujarat, India.
Ph.: 91-79-26324927, Fax : 91-79-26307341
E-mail : honeybee@sristi.org. http://www.sristi.org

**Aama Akha Pakha (Oriya)**
Dr. Balaram Sahu,
3R BP 5/2, BP Colony, Unit-8,
Bhubaneswar-751 012.Orissa.
E-mail : balaram_sahu@hotmail.com

**Hittalagida (Kannada)**
Dr. T.N. Prakash
Department of Agricultural Economics,
University of Agricultural Economics,
GKVK, Bangalore-560 065.
E-mail : prakashtnk@yahoo.com

**Num Vali Velanmai (Tamil)**
P. Vivekanandan, 45,
TPM Nagar,
Virattipathu - 625 010.
Tamilnadu
E-mail : numvali@vsnl.com

**Loksarvani (Gujarati) and Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P.O. Box No. 1550.
Ambawadi, Ahmedabad - 380 015.
E-mail : loksarvani@sristi.org
sujhbujh@sristi.org

**Ini Karshakan Samsarikkatte (Malayalam)**
James T J,
Peemade Development Society,
Peermade, Idukki-685 531, Kerala.
E-mail : pedes@md2.vsnl.net.in

Printed & Published by : **Brig. P. Ganesham,** VSM (Poorva Senani), on behalf of **"HoneyBeeAP"**
102, Vayupuri, Sainikpuri Post, Secunderabad - 500 094. A.P.**Ph.: 040-27118555, Cell : 0 98660 01678.**
Printed at : **Narendra Grafix,** Chikkadpally, Hyderabad. **Ph. : 93913 75655**

# సంపాదకీయం

పల్లెసృజన సంపాదకుడిగా, హనీబీఏపి కో-ఆర్డినేటర్‌గా నా మనోభావాలను, మా కలలను మీతో ఈ సంపాదకీయం ద్వారా పంచుకుంటున్నాను. ఒకసారి 15 సంచికల సంపాదకీయాలను తిరగేసి చూస్తే, గత అయిదు సంవత్సరాల్లో హనీబీఏపి కొన్ని చిన్న చిన్న కలలు నిజాలుగా మారాయి. దీనికి పాఠకులు, ఇన్నోవేటర్లు, హనీబీఏపి వాలంటీర్లు, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (ఎన్.ఐ.ఎఫ్.), ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు కారకులు. వారికి మేము సర్వదా కృతజ్ఞులము. వారి సహకారం భవిష్యత్తులో ఇలాగే కొనసాగుతుందని మనసారా ఆశిస్తున్నాం.

కారకొల్లు గ్రామవాసి చంద్రశేఖర్ గారి మూలికా ఇన్నోవేషన్ వాడకం వల్ల గత నాలుగు సంవత్సరాల్లో మనుషుల వ్యాధులపై, పంట పురుగులపైనా, ఇంకా ఎన్నో రంగాలలో అద్భుత ఫలితాలను గమనించడం జరిగింది. వీటిని శాస్త్రీయంగా నిర్ధారించడానికి ఎన్.ఐ.ఎఫ్. ఆధ్వర్యంలో హనీబీఏపి హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మకమైన పరిశోధనా సంస్థ సి.సి.యం.బి. (సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ తో సంప్రదింపులు జరిపింది. వారి సహకారంతో ఈ మూలికా ఇన్నోవేషన్‌ను సమగ్రంగా పరిశోధన చేయడానికి ఒప్పందంపై సెప్టెంబర్, 2010 మొదటివారంలో సంతకాలు చేయబడ్డాయి. ఇది మాకు నిజమైన కల. మహత్తరమైన శాస్త్రజ్ఞులతో కూడుకున్న సి.సి.యం.బి. లాంటి పరిశోధనా సంస్థ గ్రామీణ ఇన్నోవేషన్లను గుర్తించి వాటిని ప్రామాణించుటకు ముందుకు రావడం, ఇదంతా మూడునెలల్లో జరిగిపోవడం మాకు ఇంకా నమ్మశక్యం కాకుండా ఉంది. ఏదియేమైనా ఒప్పందం కుదిరింది. ఇలాంటివి మరెన్నో పరిశోధనలకు, ప్రామాణికాలకు ఇది నాంది అనడంలో అతిశయోక్తి లేదు. భవిష్యత్తులో ఇలాంటి సహకారం ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలోని పరిశోధనా సంస్థల నుండి కూడా హనీబీఏపికి లభిస్తుందని ఆశిస్తున్నాము.

ఈ సంవత్సరంలో హనీబీఏపి సారథ్యంలో నాలుగు ఇన్నోవేషన్లు మార్కెట్‌లోకి వచ్చాయి. పునాది స్థాయి ఇన్నోవేషన్లను మార్కెటీకరణ చేయటానికి మేము గత నాలుగు సంవత్సరాలుగా పడిన శ్రమ ఫలించనందున మేమే ఈ బాధ్యతను స్వీకరించాలని నిర్ణయించుకున్నాం. "క్రియేటివ్ మైండ్స్" అన్న సంస్థను ఇన్నోవేటర్ల సంస్థగా ప్రారంభించి ప్రథమంగా నాలుగు ఇన్నోవేషన్లను మార్కెట్‌లోకి తీసుకురాగలిగాము. ఈ వినూత్న ప్రయోగం విజయవంతం కావడం మాకు ఎంతో ఆనందంగా ఉంది. ఈ ప్రయోగంపై మరిన్ని వివరాలు పాఠకులకు వచ్చే సంచికలో అందిస్తాం.

'పల్లెసృజన' నాలుగు వత్సరాలు పూర్తి చేసుకున్నది. అయిదవ సంవత్సరం నుండి 'పల్లెసృజన'ను ద్వైమాసిక పత్రికగా ప్రచురించాలని నిర్ణయించుకున్నాము. పాఠకులకు త్వరత్వరగా పల్లె జ్ఞానాన్ని చేరవేద్దామన్న ఆతురత మమ్మల్ని ఈ మార్పుకు ప్రోత్సహించింది. అయితే ఈ మార్పు విజయవంతం కావాలంటే పాఠకుల సహకారం ఎంతైనా అవసరం. జ్ఞానపరమైన రచనలు పంపడమే కాకుండా, చందాదారులను కూడా తయారు చేసి మా ప్రగతి పథంలో తోడ్పడతారని ఆశిస్తున్నాము.


**భవదీయ**

**'బ్రిగేడియర్' పి. గణేశం**

**'పల్లెసృజన'లో కొన్ని వ్యాసాలను 'హనీబీ' ఇంగ్లీషు పత్రికనుండి అనువాదం చేయటం జరిగింది.**
**ఈ అనువాదాలను మాకు ఎంతో సహృదయంతో అందించిన శ్రీ సుబ్రహ్మణ్యం గారికి,**
**శ్రీ శశిమోహన్ గారికి కృతజ్ఞతలు** – సంపాదకులు.

## స్వశక్తితో పైకివచ్చిన గ్రామీణ స్థాయి యువ ఇన్నోవేటరు

# బొమ్మగాని మల్లేశం




ఆంధ్రప్రదేశ్ లోని నల్గొండ జిల్లాలో ఆజింపేట్ వ్యవసాయ ప్రధానమైన గ్రామం. ఈ గ్రామంలో శ్రీమతి లక్ష్మి, వెంకయ్య దంపతులకు బొమ్మగాని మల్లేష్ 1985 మార్చిలో ఇద్దరు ఆడపిల్లల తర్వాత జన్మించిన బిడ్డ. ఈ దంపతులకు ఇతనే ఏకైక మగ సంతానం. స్వంత గ్రామంలోనే 6వ తరగతి వరకు చదువుకున్న మల్లేష్ ఉన్నత పాఠశాల చదువులకై 7 కిలోమీటర్ల దూరంలోనున్న అడ్డగూడు గ్రామానికి వెళ్ళి 10వ తరగతి వరకు అక్కడే చదువుకున్నాడు. గ్రామంలోని తన తోటి విద్యార్థులతో రోజూ కాలి నడకన అడ్డగూడు గ్రామానికి వెళ్ళి వస్తూవుండేవాడు. మల్లేష్ తండ్రి వ్యవసాయ కూలీ. తల్లి కాళ్ళు చేతులలో నెప్పి కారణంగా తన పనులు తనే చేసుకోలేక మంచంమీద ఎక్కువ కాలం ఉండేది. 199లో మల్లేష్ 10వ తరగతి విద్యను పూర్తి చేసుకుని అక్కడితో చదువు మానేసి సమీపంలోని వరంగల్ పట్టణంలో ఒక బేకరిలో ఆరు నెలల పాటు పని చేశాడు. అక్కయ్యల పెళ్ళికి డబ్బు కూడబెట్టాలని తలంపుతో ముంబాయి వెళ్ళి కొంత కాలం పాలు అమ్మి, ఇంటిపని కూడా చేశాడు.



ఈ విధంగా ఒక సంవత్సర కాలం పనిచేసి పదిహేను వేల రూపాయలతో స్వంత ఊరు తిరిగి వచ్చి అక్కయ్యల పెళ్ళిల్లు

చేశాడు. మండల కేంద్రమైన మోత్కూరులో ఒక ఎలక్ట్రానిక్ రిపేరు షాపులో 2001లో దాదాపు ఆరు నెలలు పని చేశాడు.

ఇక్కడ పని నేర్చుకోవటానికే చేరాడు కనుక జీతం ఇచ్చేవారు కాదు. ఇక్కడ పని చేస్తుండగానే మల్లేశ్ చౌక్, స్టార్టర్ లేకుండానే ట్యూబ్‌లైట్లను వెలిగించే ఒక సర్క్యూట్ కనుగొన్నాడు. దీని సహాయంతో కాలిపోయిన ట్యూబ్‌లైట్లను కూడా వెలిగించవచ్చు. ఈ విధంగా 2001 లో తన 16వ యేటనుండి ఇన్నోవేషన్లు చేస్తూ, స్వంతంగా 1000కి పైగా ఈ ట్యూబ్‌లైట్ కిట్‌లను అమ్మాడు. ఇంట్లో అక్కయ్యలకి పెళ్ళయి వెళ్ళిపోవటంతో తండ్రి వ్యవసాయ కూలీకి వెళ్ళిపోగా ఇంట్లో తల్లి ఒంటరిగా వుండేది. సాయంకాలం వీరు వచ్చి లైట్లు వేసేంత వరకు మంచం మీదినుంచి లేవలేని కారణంగా ఆమె చీకట్లోనే వుండిపోవాల్సి వచ్చేది. ఇది చూసిన మల్లేశ్ తల్లి కొరకు ఏదైనా చేయాలనుకున్నాడు. ఆలోచించి 2004లో మంచంలో వుండి లైట్లు, ఫ్యాను పని చేయించే రిమోట్ కంట్రోల్‌ను రూపొందించాడు. గోడపైన వుండే స్విచ్ బోర్డుమీద ఒక చిన్న సెన్సర్‌ను అమర్చి రిమోట్‌తో ఫ్యాన్లను, లైట్లను ఆపరేట్ చేయవచ్చు. మల్లేశం ఈ సృజనాత్మకత వలన అతని తల్లికి పని సులువయింది. తల్లి ఇబ్బందులను




దూరం చేయడానికి తనయుడు తన క్రియాశీలతను వుపయోగించడం కంటే ఉత్తమమైనది లేదేమో!

ఇలా ఎంతమంది పిల్లలు తమ తల్లిదండ్రుల కష్టాలను తీర్చటానికి మార్గాలు కనుగొంటున్నారు? మల్లేశ్ 2004లో తన అమ్మకాల జాబితాలో ఈ రిమోట్‌ను కూడా చేర్చి ఇంతవరకు



దాదాపు 300 రిమోట్‌లు అమ్మాడు. ఈ పనంతా అతను తన గుడిసెలోనే చేసుకుంటూ పక్కన వున్న ఊళ్ళల్లో, పట్టణాల్లో అమ్మకాలు సాగిస్తూ వుండేవాడు. నల్గొండ జిల్లాలోని డిస్ట్రిబ్యూటర్లతో స్నేహం చేసి వారి ద్వారా అమ్మకాలు కొనసాగించేవాడు. ఇతని వస్తువులకు చాలా గిరాకీలు వున్నా కావలసిన మూలధనం లేని కారణంగా తగినన్ని వస్తువులు చేయలేక పోయాడు. ఇతను ఒంటరిగానే పనిచేస్తూ, వచ్చిన లాభాలతో జీవనం సాగిస్తూ వచ్చాడు.

2004లో సైకిల్ డైనమోతో ఒక సెల్‌ఫోన్ ఛార్జర్ తయారు చేసి చుట్టుపక్కల గ్రామాల్లో 300 చార్జర్లు అమ్మాడు. మల్లేశం తను సర్క్యూట్లు చేయటానికి నాణ్యమైన ఎలక్ట్రానిక్ వస్తువులు 100 కిలోమీటర్ల దూరంలో వున్న హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసేవాడు. ఈ పనంతా తన గుడిసెలోని మట్టినేల పైనుంచే చేశాడు. 2005లో పోచంపల్లిలోని స్వామి రామానంద తీర్థ ఆశ్రమంలో ఒక నెల రోజులు సౌరశక్తితో పని చేసే వివిధ వస్తువులపై శిక్షణ పొందాడు. ఈ పరిజ్ఞానంతో సౌరశక్తితో పనిచేసే ఒక సెల్‌ఫోన్ చార్జర్‌ను తయారు చేసి దాదాపు 20 చార్జర్లు అమ్మగలిగాడు. తన గ్రామంలో పోలియో కారణంగా నడవలేని ఒక గ్రామస్తుని కొరకు సౌరశక్తితో పనిచేసే ఒక మూడుచక్రాల బండిని తయారు చేసి 2007లో అతనికి బహూకరించి దాదాపు 2 సంవత్సరాలు దానికి అవసరమైన మరమ్మత్తులు, మార్పులు కూడా చేశాడు. తగిన ఆర్థిక స్థోమత లేని కారణంగా ఈ ప్రయోగం అర్థాంతరంగా ఆగిపోయింది.

మల్లేశ్ తనకు ఎన్ని కష్టాలున్నా, ఇబ్బందులున్నా తన తెలివి తేటలు, వనరులు ఇతరుల బాగుకోసం వాడుతూ పంచుకునే వాడు. దీని కారణంగా 22 యేళ్ళ యుక్త వయసులోనే ఆ ప్రాంతంలో చాలా ప్రత్యేకమైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్నాడు.

ఒకసారి హైదరాబాద్‌లో వున్న ఒక బంధువు ఇంటికి వెళ్ళి అక్కడ సంపునుండి ఇంటిపైకి నీళ్ళు ట్యాంకులోకి నింపుతుండగా అది నిండి నీరు క్రిందకు పారిపోవటం గమనించాడు. దీనికై ఓవర్ హెడ్ ట్యాంకులకు మోటారు కంట్రోలర్‌ను రూపొందించాడు. దాన్ని మొదటిసారిగా తన బంధువు ఇంట్లోనే పరీక్షించి బిగించాడు. దీనితో ప్రాచుర్యం వచ్చి 2008 నుంచి దాదాపు ఇటువంటి 50 పరికరాలను హైదరాబాద్ పట్టణంలోనే ఏర్పాటు చేశాడు. ఈ సులభమైన పద్ధతిలో సెన్సార్లు మొదలైనవి ఏవీ లేవు. ఇది కేవలం మెకానికల్ పద్ధతిలో వుండి బలంగా, మన్నికగా వుండేవిధంగా తయారు చేశాడు.

తను సంపాదించిన సౌరశక్తి ఉపయోగ జ్ఞానంతో గత రెండు సంవత్సరాల నుంచి సౌరశక్తితో పనిచేసే ఎఫ్.ఎం. రేడియో (10 రేడియోలు అమ్మాడు), సోలార్ టోపీ, సోలార్ టివి, సోలార్ డెజర్ట్ కూలర్ మొదలైన ఎన్నో పరికరాలు రూపొందించాడు.

నల్గొండ జిల్లాలో వ్యవసాయం కొరకు బావుల నుంచి నీటిని పంపుచేసే మోటార్ల వినియోగం ఎక్కువగా వుంది. నీటి స్థాయి తక్కువగా వున్నప్పుడు తగిన సమయంలో మోటారు ఆపి వేయక పోవటం వలన మోటార్లు కాలిపోయి వ్యవసాయ దారులకు చాలా ఆర్థిక నష్టంతో పాటు పొలాలకు కూడా నష్టం వాటిల్లేది. ప్రాంతీయ ఇబ్బందులను చూసి స్పందించే మన మల్లేశ్ నీరు తక్కువగా వున్నప్పుడు మోటారును ఆటోమేటిక్‌గా ఆపివేసే ఒక పరికరాన్ని కనుగొన్నాడు. దీనికై అతను దాదాపు 20 సార్లు ప్రయత్నం చేసి, ఆరు నెలలు శ్రమించి దీనిని సమర్థవంతంగా పనిచేసేలా రూపొందించి, 2009 నుంచి అమ్మకానికి పెట్టాడు.

గ్రామాలలో కరెంటు పోయినపుడు కిరోసిన్ దీపాలు వాడే బదులు ఎల్.ఇ.డి. లాంతర్లను రూపొందించాడు. దీనికై అతను చాలా శ్రమపడవలసి వచ్చింది. కిరోసిన్ బదులు ఎల్.ఇ.డి. లైట్లను పెట్టడం, అది గ్రామీణ పేదవారికి చవకగా తయారు చేసి ఇవ్వటం ఇతను సాధించిన మరో విజయమని చెప్పాలి. మల్లేశ్‌ని స్ఫూర్తిగా తీసుకుని దేశంలోని వివిధ ప్రాంతాల్లో వున్న వ్యక్తులు, సంస్థలు తమ చుట్టూ వుండే వారి కష్టాలను తొలగించటానికి పాటు పడతారని ఆశిద్దాం. ప్రత్యేకించి విద్యా సంస్థలలో అధ్యాపకులు, విద్యార్థులు తమ ఆధీనంలో వున్న వనరులను ఇటువంటి సమాజ ఉపయోగకరమైన పనులకు వినియోగించే ప్రయత్నం చేస్తే సమాజంలో సంతోషం వెల్లి విరుస్తుంది.

నాలుగేళ్ళ క్రితం 2007లో మల్లేశ్ తన వ్యాపారాన్ని మండల కేంద్రమైన మోత్కూరుకు మార్చి అక్కడ ఒక అద్దె గదిలో తన వర్క్‌షాప్‌ను ప్రారంభించాడు. వ్యాపారం కొద్దిగా పెరగటంతో 2010లో అదే ఊళ్ళోని మెయిన్ రోడ్‌లో కొంత పెద్ద ఇంట్లోకి తన కార్యాలయాన్ని మార్చాడు.

ప్రస్తుతం మల్లేష్ రూపకల్పన చేస్తున్న అనేక వస్తువులు వివిధ దశలలో వున్నాయి. ఇతని రూపకల్పనలలో ప్రత్యేకత ఏమిటంటే తన చుట్టూ వుండే వ్యక్తులు, సమాజం అవసరాలు తీర్చటానికి ఉపయోగ పడతాయి కనుక వీటిని అమ్మటానికి పెద్దగా శ్రమపడవలసిన అవసరం లేదు. బ్యాటరీతో పనిచేసే మోటారు కొంత సేపటికి బ్యాటరీ అయిపోగానే రీచార్జి చేయవలసి వస్తుంది. మల్లేశం మోటార్ కం డైనమో తయారు చేశాడు. దీనిలో డైనమో మోటారు బ్యాటరీని ఎప్పటికప్పుడు రీచార్జి చేస్తూనే వుంటుంది. దీనికారణంగా రైతులు మాటి మాటికీ బ్యాటరీలు మార్చనవసరం లేకుండా బ్యాటరీలతో నడిచే మోటార్లను ఎక్కువ కాలం వాడే అవకాశం కలిగింది.

కాలిపోయిన ట్యూబ్‌లైట్‌ను తిరిగి వెలిగించే పరికరంలో పొడుగాటి వైరు ఒకటి వుండేది. ప్రస్తుతం దానిని మార్చి చిన్న వైరుతో పని జరిగేలా ఈ పరికరాన్ని తయారు చేస్తున్నాడు.

సి.ఎఫ్.ఎల్. బల్బులు చెడిపోయినా వాటిని తిరిగి పని చేసేలా చేయటానికి కూడా ప్రయత్నాలు చేస్తున్నాడు. రైతులు తమ పొలాల్లో కలుపు మొక్కలు తీయటానికి చాలా శ్రమ, ఖర్చు, మనుషులు అవసరమయ్యేది. ఈ శ్రమను తగ్గించటానికి మల్లేశం సౌరశక్తితో పనిచేసే కలుపు తీసే యంత్రాన్ని చవకగా రైతులకు అందించటానికి ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇదేవిధంగా సెల్‌ఫోన్‌లో ఎస్.ఎం.ఎస్. ద్వారా పని చేసే రిమోట్ స్టార్టర్‌ను, తీగలు లేకుండా కరెంటును పంపే ప్రక్రియ, గదుల్లో ఎవరూ

లేనప్పుడు లైట్లు వాటంతట అవే ఆరిపోయే ప్రక్రియ మొదలైనవి ఎన్నో ఇతని మదిలో తిరుగాడుతున్నాయి.

తరచూ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ప్రమాదాల్లో చనిపోయిన వారిని చూసినపుడల్లా మల్లేశ్ చాలా బాధపడేవాడు. దీనికై మద్యం సేవించినవారు వాహనం నడపటానికి ప్రయత్నిస్తే వాహనం స్టార్ట్ కాకుండా వుండేలా ఒక పరికరాన్ని రూపొందించాడు. వాహనానికి 5 అడుగుల దూరంలో తాగిన వ్యక్తి వుంటే వాహనం స్టార్ట్ అయ్యే సమస్యేలేదు! ఇక్కడ మనం గుర్తించాల్సిన విషయం ఏమిటంటే మల్లేశ్‌కి కేవలం 24 సంవత్సరాలే!! సమాజంపై ఆయనకున్న తపన అనంతం.

ప్రస్తుతం మల్లేశ్ నెలసరి అమ్మకాలు రూ. 40 వేల వరకు వుంటున్నాయి. దీని ద్వారా అతనికి నెలకు 5 నుంచి 7 వేల వరకు ఆదాయం వస్తోంది. మల్లేశం ప్రారంభించిన ఎం.కె. పవర్ సిస్టమ్స్ ఇతని ఒక్కడి చేతిమీదుగా నడుస్తున్న సంస్థ. దీనికి ఇతనే కొనుగోలు చేస్తాడు, వస్తువులు తయారు చేస్తాడు, నాణ్యత పరీక్షిస్తాడు, అమ్మకాలూ చేస్తాడు. ఏలాంటి రుణమూ తీసుకోలేదు, ఇతను ఎవరికీ అప్పు లేదు. తను తయారు చేసే వస్తువులు నాణ్యమైనవిగా ఉండటానికి ప్రత్యేకమైన శ్రద్ధ కనబరుస్తాడు. ప్రతి వస్తువు తయారు చేసేటపుడు ఒకటికి పదిసార్లు పరీక్షించి, ఫలితాన్ని బేరీజు వేసి, అవసరమైతే వస్తువుని తిరిగి రూపొంది స్తాడు. ఇలా తనకి సంతృప్తికరంగా వస్తువు తయారు అయ్యేంత వరకు చేస్తూనే వుండటం ఇతని ప్రత్యేకత.

మల్లేశ్ ఇంతమందికి అమ్మకాలు జరిపినా బాగాలేవు అనికాని, పని చేయటం లేదని కాని తిరిగి వచ్చినవారు బహు అరుదు. దీనికి కారణం అతను పెట్టుకున్న ఉన్నతమైన నాణ్యతా, స్థాయి ప్రమాణాలే.

ఇతని ఆశయం నెలకి లక్ష రూపాయల అమ్మకాలు జరపాలనేదే. దీనికి అతనికి పెట్టుబడి దాదాపు రెండు లక్షల రూపాయలు అవసరమౌతాయి. తను అనుకున్న స్థాయిల్లో అమ్మకాలు జరిపితే ఒక సంవత్సరం లోపల అప్పు తీర్చేస్తానని అతని దృఢ విశ్వాసం.

అందరూ వెళ్ళే మార్గంలో కాక, మల్లేశం తనకై ఈ ప్రత్యేక మార్గాన్ని ఎందుకు ఎన్నుకున్నాడు? ఇన్నోవేటర్‌గా, వాణిజ్య వేత్తగా తన చుట్టూ ఉండే ప్రజల అవసరాలు, కష్టాలు తీర్చటమే ఇతని ధ్యేయం. అతడిని అడిగితే 2001లో మేడం క్యూరీపై 'ఈనాడు' వార్తాపత్రికలో ప్రచురించిన ఒక కథ తనకి ఈ స్ఫూర్తిని ఇచ్చింది అంటాడు. ఆ కథ కొన్ని ప్రశ్నలతో మొదలవుతుంది.....

ఎవరైనా వ్యక్తి రోజంతా ఒక కప్పు టీ, రెండు బ్రెడ్డు ముక్కలతో పని చేయగలడా?

మొత్తం కళాశాల చదువు రెండు జతల బట్టలతో పూర్తి చేయవచ్చునా?

ఒక చిన్న ఇరుకు గదిలో అటకపై కూర్చుని పరిశోధనలు చేయగలమా?

"ప్రపంచమంతా మెచ్చుకొనే ఒక విషయాన్నికనిపెట్టి దానిపై హక్కులన్నీ వదులుకుని, సంపదలన్నీ వదులుకుని పేదగానే జీవించటానికి నిర్ణయించుకుంటే!!!"

పదహారేళ్ళ మల్లేశానికి మేడం క్యూరీ కథలోని ఈ ప్రశ్నలు, ఆమెకు వచ్చిన రెండు నోబుల్ బహుమతులు పట్టుదలతో, స్ఫూర్తితో ఒంటరిగా పని చేసే ఆత్మస్థయిర్యాన్ని ఇచ్చాయి. మల్లేశ్ నవ్వుతూ భవిష్యత్తులోనికి అడుగులు వేస్తున్నాడు.

మల్లేశ్ పట్టుదలను, పనితనాన్ని గమనించిన హనీబీఏపి సంస్థ ఇతనికి చేయూతనివ్వాలని నిర్ణయించుకుని, ఇతని ఇన్నోవేషన్లను కొన్నింటిని "క్రియేటివ్ మైండ్స్" సంస్థ ద్వారా తయారు చేయించి, విస్తృతమైన మార్కెటింగ్ చేయాలని నిర్ణయించింది. మల్లేశ్ ఒక సంస్థ. తనకు తానుగా పెంపొందిం చుకున్న వ్యక్తిత్వం. ఇంత చిన్న వయస్సులోనే కొనుగోలు, ఉ త్పత్తి, మార్కెటింగ్, నాణ్యత, ఆర్థిక వ్యవహారాలు అన్నీ పకడ్బందీగా చేయగల మల్లేశ్ ఏ మేనేజ్‌మెంట్ గ్రాడ్యుయేట్‌కు తీసిపోగలడా? సహజ ఉద్యోగపతి, ఇన్నోవేటర్ మల్లేశ్ కలలను హనీబీఏపి నిజం చేయడానికి పూర్తి సహకారం చేస్తుంది.

ఆయన దినదినాభివృద్ధికై సమాజ సేవలో మరింత కృషి చేయాలని, ఆయన కలలన్నీ నిజమవ్వాలని మనసారా ఆశిద్దాం. మల్లేశ్ స్ఫూర్తితో మరెంతోమంది ఇన్నోవేటర్లు తయారు కావాలని విద్యార్థులు వ్యాపార దృక్పథాన్ని పెంపొందించుకోవాలని ఆశించడం సహజమే కదా!



# సేవాతత్పరులకు 'సృష్టి' సన్మానం

సాంప్రదాయ "ఫుడ్ ఫెస్టివల్" సాత్విక్-09 లో క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న సామాజిక మార్పులకు తోడుగా సాంప్రదాయ జ్ఞానానికి విశేష కృషి చేస్తున్న వారిని "సృష్టి" సత్కరించడం జరిగింది. ఈ సత్కారం అందుకున్న వారిలో కొందరి సంక్షిప్త జీవిత చరిత్రను ఈ క్రింద పొందుపరుస్తున్నాము.


**లోక్‌మిత్ర ట్రస్ట్ నుండి చైతన్యభాయ్ (ఉపాధ్యాయులు):**

"నేను ఇతరులనుండి ఎలాంటి సహాయ, సహకారాలు ఆశించను. ఇతరులకు ఎల్లప్పుడూ సహాయపడుతూ, చేయూతనిస్తూ ఉండాలి అనేదే నా ఆకాంక్ష. ఎవరి నుండి ఎలాంటి సహాయ సహకారాలు లేక పోయినప్పటికి నా కార్యక్రమాలు యధావిధిగాకొనసాగాలి అనేదే నా కోరిక" అంటారు చైతన్యభాయ్.



**వాగ్మిన్ పాండ్య, ధర్మేంద్రత్రివేది, భూమిపాండ్య (సర్వప్రేమికుల క్లబ్):**

"ప్రతివ్యక్తి జీవితంలో ఎలాంటి స్వలాభాపేక్ష లేకుండ కనీసం ఏదో ఒక్క మంచి కార్యక్రమమైనా చేపట్టాలి. అలాగే జీవితానికి ఒక లక్ష్యం అంటూ ఉండాలి. పాములు కన్పిస్తే వాటిని చంపకండి! మమ్మల్ని పిలవండి" అంటారు ధర్మేంద్ర త్రివేది.



**రాంబాయ్ చరణ్ (మొక్కలు విరివిగా నాటమని కోరుతూ సుమారు 40000 పై బడి ఉత్తరాలు వ్రాసిన వ్యక్తి) :**



అనేక పర్యాయాలు నా అభ్యర్థనను మన్నిస్తూ, సమ్మతి తెల్పుతూ ఎంతోమంది నుండి ఫోన్లువచ్చేవి. నేను తలపెట్టిన ఈబృహత్కర కార్యానికి అనేక మంది తమ మద్దతును సంపూర్ణవిశ్వాసాన్ని తెలియపరిచేవారు" అంటారు రాంబాయ్ చరణ్.

**ఆర్. పి. భీమని :** రోజువారీ కార్యక్రమాలలో సాధ్యమైన ప్రతి పనికి సౌరశక్తిని వినియోగించుకోవాలని కోరుతూ సౌరశక్తిపై ఆధారపడి పనిచేసే అనేక పరికరాలను కనుగొన్నవ్యక్తి.



"నేను సూర్యభగవానునిఅమితంగా ప్రేమిస్తాను, ఆరాధిస్తాను. సౌరశక్తి నిరంతరాయంగా కొనసాగే ఇంధన వనరు" అంటారు భీమని.

**బెమంగ్ తన్యాంగ్ (మూలికావైద్యులు):**

"చాలాసార్లు నేను కనిపెట్టిందేంటంటే చాలామందికి ప్రత్యేకమైన కొన్ని మొక్కల పేర్లుగూడ తెలియవు. దీనికి కారణం ఆయాప్రాంతాలలో ఆ మొక్కలు పెరగక పోవడమే. కేవలం స్థానికంగా పెరిగే మొక్కల ఉపయోగాలు గూడ కొంత వరకే వారికి కొంతవరకే తెలుసు. ఏ మొక్కలను వేటికి ఉపయోగించవచ్చు, అలాగే వాటి అవసరం ప్రాముఖ్యత దృష్ట్యా ఏమొక్కను తీసివేయ కూడదో అనే విషయాలను నా వద్దకు వచ్చే రోగులకు చెబుతూ ఉంటాను" అంటారు బెమంగ్ తన్యాంగ్. (ఈ వ్యాసం మొదట్లో గల ఫొటోలో సన్మాన గ్రహీత).

**శ్రీమతి ఇందిరా రామనాథన్, మహారాష్ట్ర :**



మహారాష్ట్రకు చెందిన బాలక్‌రాజ్ అనే వ్యక్తి సూచించినట్లుగా శ్రీమతి ఇందిర ఖర్చులేని సహజ వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తోంది. తనకున్న 150 ఎకరాల పొలంలో ఆమె వరి, చికో, కొబ్బరి, జామ, కోక మరియు జాజికాయ వంటి సుగంధ ద్రవ్యాలను పండిస్తూనే, టేకు, మొలియాదుబియా మొదలగు చెట్లనూ పెంచుతోంది. శ్రీమతి ఇందిర గత 30 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ, సేంద్రియ వ్యవసాయంలో సుమారు 10 సంవత్సరాల అనుభవం గడించింది. తనకున్న పొలంలో అధిక దిగుబడిని సాధించేందుకు అంతర్ పంటల విధానాన్ని అనుసరిస్తోంది. దీనికై ఆమె మొలియా దుబియా మరియు కొబ్బరి చెట్ల మధ్యలో పోక మరియు కోకో చెట్లను పెంచుతోంది. ఒక వరుసలో కేవలం కొబ్బరిచెట్లనే నాటితే రెండు చెట్ల మధ్యనున్న స్థలం వృధాగా అవుతుందన్నది ఆవిడి సిద్ధాంతం. అలాగే కొబ్బరి చెట్లనుండి రాలే కొబ్బరి ఆకులు, ఆ చెట్ల మధ్య పెంచే లేత పంటలను కాపాడే పైకప్పులా పని చేస్తుంది. అంతేకాక, సూర్యరశ్మి కూడా కొబ్బరి ఆకులకే తగులుతుంది కాని, క్రిందనున్న భూమికి తగలదు. దీనిమూలంగా భూసారాన్ని కాపాడే బ్యాక్టీరియా పెరగడానికి దోహదమవుతుంది. అలాగే కొండలు, గుట్టలతో కూడిన పర్వత నేలల్లో కనీసం చదును కూడా చేయకుండా బిందుసేద్యం ద్వారా పంటలు పండించడంలో ఇందిర విజయం సాధించింది. పరిసర ప్రాంతాల రైతులు ఇందివద్దనుండే విత్తనాలు తీసుకెళ్తూ వుంటారు. వ్యవసాయంలో మెలకువలను గూర్చి శ్రీమతి ఇందిరకు రోజూ సుమారు ఐదారు ఫోన్‌కాల్స్ వస్తూ వుంటాయన్నది వాస్తవం.

**శ్రీ కిరణ్‌కుమార్ భిక్కూభాయ్ పటేల్, గుజరాత్ :**



గుజరాత్‌లోని నవసరీ ప్రాంతంలోగల నిసోడియాలో కిరణ్‌కుమార్ భిక్కూభాయ్ పటేల్ తను పనిచేసే ప్రాథమిక పాఠశాలలో ఒక నర్సరీని స్థాపించాడు. ఈ నర్సరీలో సుమారు 100-150 రకాల ఆయుర్వేద మూలికా ఔషధాల మొక్కలు పెంచుతున్నారు. ఈ నర్సరీని "ధన్వంతరి ఔషధ పార్కు" అని పిలుస్తారు. కేవలం పిల్లల కొరకే ఆ పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ క్లబ్ (ఎకో-క్లబ్) ఏర్పాటు చేశారు. ఆ క్లబ్ సభ్యులు సెలవు రోజుల్లో, ఆదివారాల్లో వచ్చి చెట్లకు నీళ్ళు పెట్టడం లాంటి పనులు చేస్తూవుంటారు. ఆ పాఠశాల తలుపులు ఆ గ్రామంలోని

ప్రతిఒక్కరికోసం ఎప్పుడూ తెరిచేవుంటాయి. ఎవరైనా, ఎప్పుడైనా చదువుకోవాలన్నా, ఎలాంటి పరిశోధనలైనా చేసుకోవాలన్నా ఆ చెట్లకిందే కూర్చోవచ్చు.

తన ఈ చర్యల ద్వారా ఎంతోమంది 'ఉత్తేజితులు కావాలి' అనేది అతని చిరకాల వాంఛ. అలాగే చదువు అనేది వ్యాపారం కాదు, సమాజంలో విలువలను పెంచే ఒక శిక్షణ అని కిరణ్‌భాయ్ భావించేవాడు. ఆ ప్రాంతంలోని అనేక పాఠశాలలు కిరణ్‌భాయ్‌ని ఆదర్శంగా తీసుకుని తమ పాఠశాలల్లో కూడా ఇలాంటి కార్యక్రమాలనే చేపడుతున్నారు.

**శ్రీ బమాంగ్ తనియంగ్, అరుణాచల్ ప్రదేశ్ :**

2000 సంవత్సరం నుండి బమాంగ్ తనియంగ్ వివిధ ఔషధ మొక్కలపై పరిశోధనలు చేస్తూ మూలికా వైద్యం ద్వారా స్థానికులకు వచ్చే వ్యాధులు నయం చేస్తున్నారు. ఇప్పటివరకు మలేరియా, టైఫాయిడ్, కామెర్లు మొదలైన వ్యాధులతో బాధపడుతున్న సుమారు 40-50 మంది రోగులకు విజయవంతంగా వైద్యం చేశారు. అలాగే స్థానిక యువకులకు ఈ మూలికా వైద్యంలో శిక్షణనిస్తూ వారిని స్థానిక మూలికావైద్యంలో నిష్ణాతులుగా తయారు చేస్తున్నారు. తన గ్రామంలో ఒక సహకార మూలికా ఉద్యాన వనాన్ని ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతవాసులను కూడా ఇలాంటి ఉద్యాన వనాలను పెంచమని ప్రోత్సహిస్తున్నాడు. ఈ చర్య ఆ ప్రాంత 'ప్రకృతి సమతుల్యాన్ని' కాపాడటమే కాక, అక్కడి భిన్న జాతుల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడటానికీ, అలాగే వివిధ మూలికా వైద్యులకు సంబంధించిన ప్రాచీన విజ్ఞానాన్ని పెంచడానికి దోహదపడుతోంది.



అక్కడి వివిధ గిరిజన జాతి ప్రజలు భిన్నమైన ఎవరి భాషలలో వారు మాట్లాడుతూ ఉండటంతో సరైన సమాచార సేకరణ - సమాచార విస్తరణ (కమ్యూనికేషన్) కొరవడి ఆ గిరిజన తెగలలో దూరాన్ని పెంచుతోంది. వివిధ గిరిజన తెగల విజ్ఞానాన్ని క్రోడీకరించి, ప్రామాణికంగా చేయటానికి విస్తృతమైన పరిశోధనలు చేసి, దానికి ప్రచారం కల్పించే దిశలో బమాంగ్ ప్రయత్నాలు చేపట్టారు.

**శ్రీమతి ఒరిక్ రాలెన్, అరుణాచల్ ప్రదేశ్ :**

అరుణాచల్‌లో మహిళా సంఘాలకు నాయకత్వం వహిస్తూ, సాంప్రదాయ విజ్ఞానాన్ని అందిస్తూ, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది శ్రీమతి ఒరిక్ రాలెన్. ముఖ్యంగా ఆమె పరిసర గ్రామాలైన సిబుట్, టకిలావ్ మరియు యాగ్రంగ్ గ్రామాల్లో మూలికలను సేకరిస్తోంది. ప్రత్యేకంగా మధుమేహం, రక్తపోటు, ఇతర సాధారణ రుగ్మతలకు పనిచేసే మూలికలను సేకరించి ఆయా వ్యాధులకు చికిత్స చేస్తోంది. ఆ గ్రామంలోని వృద్ధులనుండి నేర్చుకున్న విద్య, విజ్ఞానాలతో, వారి సహకారంతో సరైన మూలికలు గుర్తించి, సేకరించి తరువాత వాటి శాస్త్రీయ నామం, ఉపయోగాలను గూర్చి తెలుసుకుంటుంది. ఆ మూలికలకు సంబంధించిన సాంప్రదాయ విజ్ఞానాన్ని తెలుసుకోవడమే కాక, స్థానిక మూలికా వైద్యులతో తన అనుభవాలు, ఆలోచనలు పంచుకుంటుంది.



మూడు సంవత్సరాల క్రితం "సిబుత్ అనె లోకలి" పేరిక ఒక స్వయం సహాయక బృందాన్ని స్థాపించి దీని ద్వారా అనేక ఉద్యాన వనాలను పెంచే కార్యక్రమాలను చేపడుతోంది శ్రీమతి ఒరిక్ రాలెన్. ●

## "సృష్టి" పురస్కారం


**మీ ప్రాంతంలో ఇలా పునాది స్థాయిలో సమాజసేవ, సమాజ కళ్యాణ నిమిత్తమై పనిచేసే వ్యక్తులు, సంస్థలు, చేపట్టిన కార్యక్రమాలను గురించి మాకు తెలియజేస్తే మేము వాటిని "సృష్టి" పురస్కారానికి ప్రతిపాదిస్తాము. ఈ వివరాలు మాకు చేరడానికి ఆఖరు తేది 31 అక్టోబర్, 2010.**

**- ఎడిటర్**




## వేప నూనె

1. స్వచ్ఛమైన చిన్న గానుగలలో దొరికే వేపనూనెను పురుగుల నివారణలో వాడవచ్చు.
2. అర లీటరు నుండి ఒక లీటరు వేపనూనెను 100 లీటర్ల నీటికి కలిపి ద్రావణాన్ని తయారు చేయాలి.




3. దీనికి 100 గ్రాముల సబ్బు పొడిని నీటిలో కలిపిన ద్రావణాన్ని (ఖాదీ సబ్బు పొడి) పైన చెప్పిన ద్రావణంలో కలపాలి.
4. ఈ వేపనూనె ద్రావణాన్ని ఒక ఎకరాకు సాయంత్రం సమయంలో పంటపై పిచికారి చేయాలి.
5. నివారింపబడు పురుగులు : రసం పీల్చే పురుగులు (పేనుబంక, పచ్చదోమ, తెల్లదోమ, తామర పురుగులు, ఎర్రనల్లి) మొదలగునవి. తొలి దశలో ఉన్న గొంగళి పురుగులు (లార్వాలు) ఆకుముడత, నివారించవచ్చు.


**గమనిక :** 100 గ్రాముల సబ్బుపొడి కలపడం వలన ద్రావణం మొక్కకు పట్టి వుంటుంది. ఒకేసారి నేలమీదకు జారిపోదు. సబ్బు పొడికి బదులు అరకేజి కుంకుడు పొడి కలిపితే మరీ మంచిది.

## వేప పిండి

1. వేపగింజల నుండి నూనె తీయగా వచ్చిన పిప్పిని వేప చెక్క లేదా, వేప పిండి అంటారు.
2. వేప పిండిలో 5-6% వరకు నత్రజని, 1%భాస్వరం, 1%

పొటాషియం మరియు ఇతర పోషకాలు ఉంటాయి.

3. వేపపిండిని ఎకరానికి 1 నుండి 2 క్వింటాళ్ళ వరకు వేయవచ్చు.
4. వేప పిండిని దుక్కి దున్నే సమయంలో వేసి పొలాన్ని బాగా కలియదున్నాలి.
5. నారుమడి తయారులో కూడా వేపపిండిని వేయవచ్చు. (ఒక సెంటు నారుమడికి 1 నుండి 2 కిలోల వేపపిండి వాడాలి)




**నివారింపబడు పురుగులు :** వేరు పురుగులు (వేరుశనగ, మిరప), నులిపురుగులు (వంగ, టమాటా, ఆకుగడ్డ).


**గమనిక :** వేప పిండిని పొతరులా చేసి పొలంలో వేసుకోవటం మంచిది. దీనివలన పంటనంతటికి సమానంగా వేపపిండి అందుతుంది.

## వేపాకు కషాయం

**వేప ఆకు వావిలాకు కషాయం తయారు చేసే పద్ధతి :**

1. 5 కిలోల వేప ఆకును గాని, లేదా వావిలాకును గాని తీసుకుని దానిని 10 లీ. నీటిలో అరగంటసేపు బాగా ఉడకబెట్టాలి.
2. ఈ ఉడుకుతున్న ద్రావణాన్ని మధ్య మధ్యలో ఒక కర్రతో కలుపుతూ ఉండాలి.
3. ఈ కషాయాన్ని బాగా చల్లార్చి, పలుచని గుడ్డతో వడపోయాలి.
4. ఈ ద్రావణానికి 100 గ్రా. సబ్బుపొడి (1 లీ. నీటిలో తయారు చేసి ద్రావణాన్ని) కలపాలి.
5. ఈ విధంగా తయారైన వేప ఆకు / వావిలాకు కషాయానికి 100 లీటర్ల నీటిని కలిపి సాయంత్రం పూట ఒక ఎకరా పంటపై పిచికారీ చేయాలి.

**నివారింపబడు పురుగులు :** తొలిదశలో లద్దెపురుగు, శనగపచ్చ పురుగు, ఆకుముడత, మిడతలు మరియు రసం పీల్చే పురుగులపై ఈ కషాయం బాగా పనిచేస్తుంది.




**నివారించు తెగుళ్ళు :** వరిలో వచ్చు ఆకుమచ్చ తెగులు, గింజనల్లబారటం, ఇతర పంటలలో వచ్చే ఆకుమచ్చ తెగుళ్ళపై ఈ కషాయం పనిచేస్తుంది.

**పని చేయడం ఎలా? :**

వేప ఆకులో సహజంగా ఉండే "అజాడిరిక్టిన్", వావిలాకులో ఉండే ఆల్కలాయిడ్‌ల వలన ఈ కషాయం పురుగులు నియంత్రించడంలో పని చేస్తుంది.

**సూచన :**

1. పంట కాలంలో పురుగుల ఉధృతిని బట్టి 2 నుంచి 3 సార్లు పిచికారీ చేసి సత్ఫలితాలు పొందవచ్చు.
2. ఈ ద్రావణాన్ని అన్ని పంటలలో వాడుకోవచ్చు.

**తీసుకోవలసిన జాగ్రత్తలు :**

కుండలో ద్రావణాన్ని వేడి చేసేటపుడు ముక్కుకు గుడ్డ కట్టుకోవాలి.

**గమనిక :**

వావాలాకు కషాయాన్ని వేపాకు కషాయంవలె అంతే మోతాదులో తయారు చేయవచ్చు.



# వర్షపాతముపై అవగాహన

పూర్వం నుండి గ్రామాలలోని పెద్దలు గ్రామప్రజల సమక్షంలో ఉగాది పర్వదిన సందర్భమున పంచాంగ శ్రవణము చేసి ఈ సంవత్సరం 4 కుంచాలు, 5 కుంచాలు వర్షం మన గ్రామంలో పడునని పంతులుగారు చెబితే విని ఆనందిస్తూ ఆ సూచనలు అనుసరించి తగిన పంటలు పండించడం మన ఆనవాయితీ. ఈనాటికీ గ్రామాల్లో ఈ పద్ధతినే ఆదరిస్తూ రైతులు సేద్యం చేస్తున్నారు. ఎపుడెపుడు ఎంతెంత వర్షపాతం నమోదు అయినది తెలుసుకొనుటకు రైతులకు వర్షపాత నమోదు నమూనాలు అందుబాటులో ఉండేవి కావు. మరియు దాని గణాంకములు కూడా తెలియవు. ప్రస్తుతం మండల కేంద్రంలోను, వాతావరణ కేంద్రంలోను మాత్రమే వర్షపాత మాపకములు ఉన్నవి.

ఇటువంటి తరుణంలో పాఠశాల విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని అలవాటు చయుటకు జి.యం.ఆర్.వి.ఎఫ్. వారు పర్యావరణ విద్య మరియు శీతోష్ణ స్థితిలోని మార్పులపై అవగాహన కల్పించుటకు కృత్యముల ద్వారాను, ఆట పాటల ద్వారాను పర్యావరణ విద్యను అందించుచున్నారు. అందులో భాగంగా వర్షపాత నమూనాను ఖర్చులేకుండా తయారు చేసి పాఠశాలలోను, కమ్యూనిటీ హాల్ లలోను ప్రదర్శన ద్వారా వివరిస్తున్నారు.

ఈ ప్రదర్శనలకు విద్యార్థినీ విద్యార్థులు, గ్రామ ప్రజలు విశేష సంఖ్యలో ఆకర్షితులై వర్షపాత నమూనాను ఏ విధంగా తయారు చేసుకోవచ్చు, గ్రామాలలో పడే వర్షాన్ని ఎలా కొలవవచ్చు వర్ష పాతాన్ని బట్టి ఏయే పంటలను పండించవచ్చు అనే విషయాలను సులభంగా తెలుసుకుంటున్నారు.

**పరికరం తయారీ విధానము :**

1. 20 సెం.మీ. పొడవుగల మూత లేని ఒక ప్లాస్టిక్ బాటిల్‌ను తీసుకోవాలి.




2. సీసా కింది భాగము సమతలంగా ఉండాలి.
3. సీసాను నాలుగోవంతు పై భాగం కోయాలి.
4. కోసిన భాగమును గరాటువలె వినియోగించాలి.
5. పై వ్యాసమును క్రింది వ్యాసము క్రింది వ్యాసము సమానం అవుతుంది.
6. పేపరుపై సెం.మీ. కొలతలుగల ఒక స్కేలును గీయాలి.
7. గీసిన పేపరు స్కేలును సీసాపై అతికించాలి.
8. వర్షపాత సూచిక సిద్ధం అయినది.
9. వర్షము పడేటపుడు ఈ సూచికను ఎత్తు పల్లాలు, చుట్టు ప్రక్కల అడ్డులు లేకుండా చూసి సమతలమైన ప్రదేశంలో పెట్టాలి.

వర్షం ఆగిన తరువాత ఆ సీసాలో చేరిన నీరును స్కేలు ద్వారా కొలిచి ఎన్ని సెంటీమీటర్ల పడినదో నమోదు చేయాలి.

ఈ పద్ధతినే పాట రూపకంగా ఈ క్రింద వ్రాయబడింది. పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు పాట రూపకంగా బోధించడానికి అనుకూలంగా ఉంటుంది.

### వర్షపాత సూచిక – పాట

అందమైన ఆకాశంలో సీసా ఉన్నది !
నాల్గోవంతు పై భాగం కోయమన్నది!!
గరాటువలె పని బాగా చేయనున్నది!
తిరగవేసి సీసాలో ఉంచమన్నది!!
పై వ్యాసం క్రింది వ్యాసమొకటన్నది
అబ్బబ్బో ఎంతెంతో అందమైనది!!
పేపరుపై స్కేలు ఒకటి గీయమన్నది!
సీసాపై దానిని అంటించమన్నది!!
'వర్షపాత సూచికను' నేనేనన్నది!
వర్షమొచ్చువేళ తనను వాడమన్నది!!
ఎత్తుపల్లం లేనిచోట ఉంచమన్నది!
చుట్టుపక్కల అడ్డాలేవీ వలదన్నది!!
వర్షపాతమెంతని కొలవనున్నది!
ఇదిగిదిగో ఇంతింతని చెప్పనున్నది!!
రండి రండి పిల్లలూ నేర్చుకోండి!
విజ్ఞానమింత సులభమని తెలుసుకోండి!!

**– కె. నాగేశ్వర రావు,** ప్రొగ్రాం అసిస్టెంట్,
జి.యం.ఆర్.వి.ఎఫ్.

## గ్రామీణ సృజనాత్మక శక్తి వేదిక 'పల్లెసృజన'

పల్లెసృజన ఒక జ్ఞానవేదికగా ఉపయోగపడాలంటే మీరు మీ సమస్యలను, ఆలోచనలను, జ్ఞాన సంపదను సంకోచించకుండా పంపండి. ఎంత చిన్న ఆలోచన అయినా సరే మేము ఆహ్వానిస్తాం. ప్రతి సంచికలో ఉత్తమ ఎంట్రీకి ఉచిత వార్షిక సభ్యత్వం ఇవ్వబడుతుంది. మీ సమస్యలను "పల్లెసృజన"లో ప్రచురిస్తాం. వాటి సమాధానాలు పాఠకులు పంపితే వాటిని కూడా ప్రచురిస్తాం. మీరంతా సహకరించి ఈ గ్రామీణ సృజనాశక్తి వెలుగుదారుల వేదికను సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నాం. -సంపాదకవర్గం

### ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ ప్రాంతంలో జరిగిన 24వ శోధయాత్ర

# నక్సల్ ప్రాంతంగా ప్రకటించిన గ్రామాల్లో విజయవంతమైన జ్ఞానయాత్ర

మరచిపోయిన జ్ఞాన దేవాలయాల సందర్శనయాత్ర "శోధయాత్ర". గత 12 ఏళ్ళుగా 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' (NIF), 'SRISTI' సంస్థల ఆధ్వర్యంలో శోధయాత్రలు ప్రతి ఆరునెలలకు ఓసారి దేశంలోని విభిన్నప్రాంతాలలో చేపట్టబడుతున్నాయి. ఇప్పటివరకు 23 శోధయాత్రలు దేశంలో జరిగాయి. కాశ్మీర్, బీహార్, కేరళ, గుజరాత్, అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఒరిస్సా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలోని మారుమూల గ్రామాల్లో ఒక వారం రోజులు దాదాపు 200 కి.మీ. నడుస్తూ ఈ యాత్ర సాగించారు. ఆంధ్రప్రదేశ్ విశాఖ జిల్లా అరకు లోయలో జూన్ 2008లో 21వ శోధయాత్ర జరిగిన విషయం పాఠకులకు విదితమే. అంతే కాకుండా శోధయాత్రల విశేషాలు పల్లెసృజన పాఠకులకు సమగ్రంగా వివరించడం జరిగింది. ఈ యాత్రలో పాల్గొనడానికి కొన్ని అర్హతలు కావాలి. www.sristi.org వెబ్‌సైట్‌లో వాటి వివరాలు లభిస్తాయి.

24వ శోధయాత్ర ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో, నారాయణపూర్ జిల్లా, బస్తర్ ప్రాంతంలో 19-24 మే, 2010లో జరిగింది. నలభై మంది యాత్రీకులు ఈ శోధయాత్రలో పాల్గొన్నారు. ఈ ప్రాంతం నక్సల్ ప్రాంతంగా ప్రభుత్వం నిర్ణయించినా, శోధయాత్రీకులకు ప్రతి గ్రామంలో ప్రశాంతత, ప్రకృతితో సమన్వయం, గ్రామీణుల ఆప్యాయత, నిరాడంబరతలే కనిపించాయి. యాత్రీకులు గ్రామస్తులు పెట్టిందే తింటారు. వాళ్ళ ఊళ్ళోనే ఆకాశం క్రింద పడుకుంటారు. వారి నీరు త్రాగుతారు. వారితో గ్రామ సంప్రదాయ జ్ఞానం, క్రియాశీలత గురించి చర్చిస్తారు. వారి సమస్యలను ఎలా పరిష్కరించుకుంటున్నారో పరిశీలిస్తారు. ఇతర రాష్ట్రాలలోని సమస్యా పరిష్కారాలను వీరికి అవసరమైతే అందిస్తారు. జ్ఞాన శోధలో, జ్ఞాన చర్చలో మనసులు కలుస్తాయి. అనురాగం, ఆప్యాయత, పెల్లుబుకుతాయి. స్వ-పర బేధాలు మాయమవుతాయి. దేశంలోని నలుమూలల నుండి వచ్చిన యాత్రీకులు విద్యార్థులు, ఆర్మీ అధికారులు, ప్రొఫెసర్లు, సైంటిస్టులు, ఉద్యోగాధిపతులు, రైతులు, వాణిజ్యవేత్తలు - పరిచయం లేని గ్రామవాసులతో అవలీలగా కలిసిపోతారు. ప్రకృతి ఒడిలో పరవశంతో కాలం గడుపుతారు. రోజుకు 20 కి.మీ. నడిచిన అలసట కాని, జీవన సరళిలో లోటుపాట్లు కాని గుర్తుకు రావు. అదొక అద్భుత అనుభవం.

ప్రతి గ్రామంలోని జ్ఞానవేత్తలను, కళాకారులను శాలువతో సత్కరించి, ప్రశంసా పత్రాలను ఇచ్చి సత్కరిస్తారు శోధయాత్రీకులు. వారి జ్ఞానాన్ని వారి అనుమతితో సేకరిస్తారు. గడచిన కొన్ని గంటలలో అల్లుకున్న మానసిక బంధం ప్రతిబింబించేలా ప్రతి గ్రామస్తులు మరో గ్రామం వరకు శోధయాత్రీకులతో నడిచేవారు. గ్రామీణ మహిళలు ఆనందంగా నవ్వుతూ, పాటలు పాడుకుంటూ శోధయాత్రీకులకై భోజనాలు వండి వడ్డించేవారు.

ఆ ప్రాంతం ప్రకృతిపరంగా ధనవంతమైనది. ఇప్పటికీ మూలికా వైద్యంతో 90 శాతం అనారోగ్యాలు నివారిస్తారు. "అసలు మా గ్రామాల్లో రోగాలు లేవండి. అయితే ఇతర రాష్ట్రాలకు పనికై పోయి తిరిగి వచ్చినవారు రోగాలను మా ప్రాంతానికి తెస్తున్నారు" అని ఒక గ్రామపెద్ద చెప్పాడు. ఆరోగ్యవంతమైన అందమైన, ఆరోగ్యవంతమైన ఈ ప్రదేశంలోనికి వెళ్ళడానికి ముందు ప్రభుత్వం హెల్త్ చెక్ చేసిన తర్వాతే ఎవరికైనా అనుమతివ్వాలి.


మీడియాలో విన్నట్లుగా అక్కడ ఉద్రిక్తమైన పరిస్థితులేమీ లేవు. జీవనం ప్రశాంతంగా ఉంది. కాని అక్కడక్కడ పోలీసు, నక్సలైట్ల కార్యక్రమాల వల్ల సంభవించిన ఘటనల వికృత స్వరూపాలు అగుపడతాయి. ప్రభుత్వం శోధయాత్రను ఆపడానికి ఎంతో ప్రయత్నించింది. కాని స్థానిక ప్రజల సహకారంతో 24వ శోధయాత్ర సంపూర్ణంగా జరిగింది.

ఈ యాత్ర విజయవంతం కావడానికి ఆ ప్రాంతానికి చెందిన సంగ్రామ్‌సింగ్ లాంటి సాహసులు కారణం. ప్రభుత్వానికి నక్సలైట్లకు విరుద్ధంగా సంగ్రామ్‌సింగ్ శోధయాత్ర తన ప్రాంతానికి ఉపయోగకరమన్న విశ్వాసంతో అహర్నిశలు శ్రమపడటం వల్లనే మేమంతా శోధయాత్ర సవ్యంగా ముగించగలిగాము. దేశానికి చదువురాని సంగ్రామ్‌సింగ్‌లు కావాలి. ధైర్య సాహసాలతో మన ప్రజలకు శ్రేయస్కరమైనది ఇవ్వగలిగే శక్తిని మనందరం కలిగివుండాలి.

ఈ యాత్రలో నక్సలైటు ప్రాంతం నిజంగా ఎలా ఉంటుందో యాత్రికులకు క్షుణ్ణంగా అర్థమైంది. మీడియా రిపోర్టులకు, యదార్థానికి ఎంత తేడా ఉందో తెలిసిపోయింది. ఈ ప్రాంతాలలోని ప్రజలకు గన్నులు, బాంబులు, హెలికాప్టర్లు, సైనికులు కాదు, మనందరి సహకారం, సరిగ్గా అర్థం చేసుకునే సమాజం కావాలి. మన దేశాన్ని ప్రశాంత పూరిత ప్రాంతంగా చేసుకోవడం మన చేతుల్లోనే ఉంది.
















# గుర్రపుడెక్క సమస్యనుంచి చెరువులకు విముక్తి కలిగిస్తున్న
# గోదాసు నర్శింహ

తలచుకుంటే ఏదైనా చేయగలిగిన శక్తి సామర్థ్యాలున్న సాధారణ యువకుడు మన గోదాసు నర్శింహ. ఆయన అన్ని పనులలో ఆయన భార్య లావణ్య, ముగ్గురు పిల్లలు సహాయకారిగా ఉంటారు. నర్శింహ ఎనిమిదేళ్ళ వయసులో తన తల్లిదండ్రులను కోల్పోయారు. సోదరుని సహాయంతో 10వ తరతి వరకు చదువు పూర్తి చేసి సివిల్ ఇంజనీరింగ్ డిప్లమాలో చేరినా పూర్తి చేయలేక పోయాడు.

'డబుల్ ఇక్కత్' చీరలకు చీరలకు ప్రసిద్ధి గాంచిన 'పోచంపల్లి' గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలోనున్న 'ముక్తాపూర్' గ్రామంలో నర్శింహ, అంజయ్య – సీతమ్మలకు 1970లో జన్మించాడు. వృత్తిరీత్యా జాలరి అయిన అంజయ్య ఎంత కష్టపడ్డా కనీస అవసరాలు కూడా తీరేవి కావు. సీతమ్మ పొలాలలో కూలీగా పని చేస్తూ భర్తకి చేదోడు వాదోడుగా వుండేది. అర్థాంతరంగా డిప్లమా చదువు ఆపాల్సి వచ్చిన నర్శింహ ఒంటరివాడై తప్పనిసరి పరిస్థితుల్లో ఒక ప్రైవేటు పాఠశాలలో అధ్యాపకుడిగా చేరి గత 18 సంవత్సరాల నుంచి అందులోనే ఉండిపోయాడు. పక్క గ్రామంలోని లావణ్యను 1994లో వివాహం చేసుకున్న తర్వాత వారికి ఒక కొడుకు, ఇద్దరు కూతుర్లు కలిగారు. అధ్యాపకుడిగా పనిచేస్తున్న నర్శింహ పిల్లలకు పాఠాలు చెప్పడంతో పాటు తోటి జాలర్లతో కలిసి హైదరాబాద్‌లోని ఒక కాంట్రాక్టరు కొరకు స్థానిక చెరువులో చేపలు పట్టడానికి సహకరించేవాడు.

ఈ కాంట్రాక్టరు ప్రతి సంవత్సరం గ్రామంలోని చెరువులోకి వెయ్యటానికి చేప విత్తనాలను సరఫరా చేసేవాడు. వాటిని పెంచి, అవసరమైనపుడు పట్టి ఇచ్చే బాధ్యత గ్రామ జాలర్లది. ఈ వ్యాపకంలో వచ్చిన డబ్బును జాలర్లు అందరూ సమానంగా పంచుకునేవారు. ప్రతి సంవత్సరం గుర్రపు డెక్క





చెరువులోని చాలా భాగాన్ని కప్పివేసి, చేపలు పెరగడానికి అవరోధకంగా ఉండేది. జాలర్లు ప్రతిసారీ ఈ గుర్రపు డెక్కను లాగి తీసి గట్టుపై వేయాల్సి వచ్చేది. దీనికై దాదాపు యాభైమంది జాలర్లు సంవత్సరంలో 60 రోజులు పని చేయాల్సి వచ్చేది. ఇంత చేసినా పని చాలా మెల్లగా, కష్టంగా ఉండటమే కాక, పాముకాట్లకు గురవ్వటమే కాక, కాళ్ళకు చర్మవ్యాధులు వచ్చేవి. ఇంతే కాక గుర్రపు డెక్కను తీయటానికి వాడే పనిముట్లు మొదలైన ఖర్చులు చాలా ఎక్కువగా ఉండేవి. 'ముక్తాపూర్' పరిసరాల్లోని సుమారు 10 గ్రామాలకు ఇదే సమస్య ఉండేది. గుర్రపుడెక్క తీయటానికయ్యే ఖర్చు భరించలేనంతగా తయారైంది. ఒక జాలరికి రోజుకు వంద రూపాయలు వస్తే, 50 మందికి అరవై రోజులకి 3 లక్షల రూపాయల ఖర్చు వచ్చేది. ఇది ముందుగా కాంట్రాక్టరు ఖర్చు చేసినా జాలర్లకు రావాల్సిన డబ్బులోనుంచి దీనిని మినహాయించేవాడు. ఈ గుర్రపు డెక్క వలన జాలర్లకు ఆర్థిక నష్టంతో పాటు ఆరోగ్యమూ దెబ్బతినేది. జాలర్లు ఎదుర్కొంటున్న ఈ జటిల సమస్యకు ఎవరూ పరిష్కారం చూపించడానికి ముందుకు రాలేదు.

నర్సింహ తన తోటివారిని ఈ కష్టాలనుండి తప్పించాలని నిశ్చయించుకున్నాడు. గుర్రపు డెక్కను చిన్న ముక్కలుగా నరికివేసే ఒక పరికరాన్ని తయారు చేస్తాను దానికై ఆర్థిక సహాయం చేయండి అని అడిగాడు. జాలర్ల సంఘం ఇతని సామర్థ్యాన్ని అనుమానించి, ఇతని ప్రతిపాదనను త్రోసిపుచ్చింది. పట్టువదలని నర్సింహ తన భార్యతో ఈ విషయమై చర్చించి తన స్వంత డబ్బుతో కొందరు మిత్రులు ఇచ్చిన ఆర్థిక సహకారంతో ఆ పరికరాన్ని తయారు చేయాలని నిర్ణయించుకున్నాడు.

ఈ యంత్రం తయారీకి ఒక 5 హార్స్‌పవర్ మోటార్ సహాయంతో 8 కట్టర్లు వున్న ఒక షాఫ్ట్‌ను ఏర్పరిచాడు. ఒక కన్వేయర్ బెల్ట్ ద్వారా చెరువులో వున్న గుర్రపు డెక్కను కేవలం ఇద్దరు లేక ముగ్గురు మనుషుల సహాయంతో బ్లేడ్‌మీదికి చేరవేస్తే ఈ యంత్రంలో ఏర్పాటు చేసిన కట్టర్ వాటిని చిన్న చిన్న ముక్కలుగా చేసి బయటికి పంపుతుంది. ఈ యంత్రం చాలా సమర్థవంతంగా పనిచేస్తోంది. 50 మంది మనుషులు 30 రోజుల్లో చేసే పనిని నలుగురు మనుషులు కేవలం 5 రోజుల్లోనే పూర్తి చేయవచ్చు. కూలీలకు రూ. 2,000/-లు, డీజిల్‌కు రూ. 1,500/-లు మాత్రమే ఖర్చవుతుంది. ఈ లెక్కన సంవత్సరానికి మనుషులు చేసే పనికి అయ్యే ఖర్చు రూ. 3 లక్షలైతే, ఈ యంత్రం ద్వారా అదే పనిని కేవలం రూ. 7 వేలతోనే పూర్తి చేయవచ్చు. ఈ విధంగా చేసిన ఆదాతో పాటుగా చేపలు సమృద్ధిగా ఎదగాటానికి, సూర్యరశ్మి నీటిపై సోకడం ద్వారా చేపలు కూడా ఆరోగ్యంగా పెరగటాకి దోహదపడింది.

ఈ యంత్రం తయారు చేయటానికి ప్రస్తుతం దాదాపు రూ. 60 వేల వరకు ఖర్చయింది. దీనిని ఇంకా అభివృద్ధి చేయటం ద్వారా ఈ ఖర్చుని రూ. 40 వేలకు తయారు చేసే అవకాశముంది. తనకు అత్యంత సహకరాం, ప్రోత్సాహాన్నిచ్చిన సతీమణికి అంకితంగా ఈయంత్రానికి "లావణ్య గుర్రపుడెక్క కటింగ్ మిషన్" అని నామకరణం చేశాడు.

నర్సింహ తయారు చేసిన గుర్రపు డెక్కను కత్తిరించే





యంత్రం పరిసర ప్రాంతాల్లో సంచలనం సృష్టించింది. వార్తా పత్రికలు, సొసైటీ సభ్యులు ఈ సాధారణ యంత్రం ద్వారా వారికి తరతరాలుగా వున్న గుర్రపుడెక్క సమస్య నివారణకి మార్గం దొరికినందుకు ఎంతో ఆనందిస్తున్నారు.

తప్పులు దిద్దుకుంటూ ఈ యంత్రాన్ని తయారు చేయటానికి నర్సింహకి దాదాపు లక్షరూపాయల దాకా ఖర్చయింది.

ఈ యంత్రంలో కట్టర్ ఇంకా సమర్థవంతంగా పనిచేసేలా చేయటానికి అవకాశముంది. కొంత పారితోషికం తీసుకుని పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లోని గుర్రపు డెక్కను తొలగించడమే తన ప్రవృత్తిగా ఏర్పరచుకోవాలని నర్సింహ ఆశయం. దీనికై అతనికి కావలసిన సహాయ సహకారాలను 'హనీబీఏపి' అందిస్తుందని రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీ గణేశం గారు నర్సింహకు హామీ ఇవ్వడమైనది.

నర్సింహ తయారు చేసిన 'లావణ్య గుర్రపుడెక్క కటింగ్‌మిషన్' వద్దకు గుర్రపు డెక్కను చేరవేయాలి. నర్సింహ అలాకాకుండా చెరువులోని గుర్రపుడెక్క వద్దకి మిషన్ చేరేలా నీటిలో తేలియాడే ఒక రాఫ్ట్‌పై ఈ మిషన్ బిగించే ప్రమయత్నంలో ఉన్నారు.

నీటిపై తేలియాడే విధంగా ఈ యంత్రాన్ని రూపొందిస్తే ఇంకా మంచి ఫలితాలు సాధించటంతో పాటు, పెద్ద పెద్ద చెరువుల్లోని గుర్రపు డెక్కను కూడా సునాయాసంగా తీసివేయ వచ్చని 'హనీబీఏపి' భావిస్తోంది. దేశవ్యాప్తంగా వున్న ఈ సమస్యకు మన నర్సింహ రూపొందించిన ఈ యంత్రం స్ఫూర్తిగా ఈ దిశలో ఇంకా ప్రయత్నాలు జరుగుతాయని ఆశిద్దాం.

హనీబీఏపి నర్సింహ ప్రయత్నాలకు సంపూర్ణ సహకారం, సలహాలను ఇస్తున్నది. పేటెంట్‌కు, వ్యాపారవకాశాలకై ప్రయత్నాలు ప్రారంభించింది.

"లావణ్య గుర్రపుడెక్క కటింగ్" మిషన్ జాలర్లకు ఒక వరంగా తయారై వారి నష్టాల, కష్టాలను తగ్గించి, చేపల ఉత్పత్తిని రెట్టింపు చేస్తుందని ఆశిస్తున్నాం.

## గుర్రపుడెక్క విషయంలో ఈ క్రింది వాటికి సమాధానాలు వెతకవలసి వున్నది

- ❀ గుర్రపుడెక్క చేపలకి ఆహారంగా పనికి వస్తుందా?
- ❀ చెరువు అడుగు భాగానికి పడిపోయిన గుర్రపుడెక్క ముక్కల కారణంగా చేపల పెరుగుదలకి ఏమైనా హాని జరుగుతుందా?
- ❀ గుర్రపుడెక్కను తీసివేసిన తర్వాత చెరువులో మిగిలిపోయిన వాటి వేళ్ళు కారణంగా అది మళ్ళీ మొలుస్తుందా?
- ❀ గుర్రపు డెక్క ముక్కలు చేసిన తర్వాతగానీ, కాల్చివేసిన తర్వాతగానీ చెట్లకి, చేలకి ఎరువుగా పనికి వచ్చేలా తయారు చేయవచ్చా?
- ❀ గుర్రపుడెక్కను కాల్చివేయటం ద్వారా పర్యావరణానికి ఏమైనా హాని కలుగుతుందా?
- ❀ మనుషులు, జంతువులు కూడా తినని ఈ గుర్రపు డెక్కలో ఏదైనా ఔషధ విలువలు ఉన్నాయా?

**వీటికి సమాధానం దొరికితే ఈ సమస్యని ఇంకా సమర్థవంతంగా నిర్మూలించటంతో పాటు ఈ ప్రక్రియని ఫలవంతంగా కూడా మార్చుకోవచ్చు.**



# ఎన్.ఐ.ఎఫ్. 5వ జాతీయ పురస్కారాలు

## సృజనాత్మకతలో చిరుదివ్వెలు

ప్రోత్సాహక పురస్కారాలు స్వీకరించిన వారి వివరాలను క్లుప్తంగా ఇక్కడ పొందుపరుస్తున్నాము. ఈ ఔత్సాహికుల ఆలోచనలు కేవలం పంచుకోవటానికి కేకుండా అశేష పాఠకులను 'హనీబీఏపి' సభ్యులుగా చేసుకునే దిశలో ప్రయత్నాలు సాగాలని మా ఆకాంక్ష. సమాజంలో వెలుగులోకి రాక మరుగున పడి, గుర్తింపుకు నోచుకోని ఎంతోమంది ఔత్సాహికులను గూర్చి, సమాజం నుండి సహాయ సహకారల కోసం ఎదురు చూసే వారిని గురించి తెలుసుకోవటంలో పాల్పంచుకోవాలి. మన కార్యక్రమాలకు సంబంధించిన ఏ విషయంలోనైనా మీ సహాయ సహకారాలు, సలహాలు అందించవచ్చు. – ఎడిటర్.

ప్రోత్సాహక పురస్కారాలు :

### శక్తి మరియు పరిసరాలకు సంబంధించినవి

**వాననీటి పిచికారి – నీటి పొదుపులో ఒక వినూత్న విధానం :**

ఉన్నత పాఠశాలలో పనిచేసే 54 సంవత్సరాల కె.జె. ఆంటోజి, కొచ్చిన్‌లోని తీర ప్రాంతంలో నివసిస్తూ వుంటాడు. ఈ ప్రాంతంలో భూగర్భ జలవనరులు ఉప్పగా ఉంటాయి. ఆంటోజికి యుక్త వయస్సునుంచి కూడా విజ్ఞాన శాస్త్రం పట్ల అభిలాష, ఆసక్తి ఎక్కువ. ఇతడు



విద్యార్థి దశలో ఉన్నప్పుడే ఒక్కోసారి విజ్ఞాన ప్రదర్శనల్లో ప్రదర్శించే వస్తువుల తయారీ మరియు ఏర్పాటులో ఉపాధ్యాయులు కూడా అతడి సహాయం కోరేవారు. తీరప్రాంతంలో భూమినుండి వెలువడే ఉప్పునీటి సాంద్రతను తగ్గించడానికి వాననీటి పిచికారీని కనుగొన్నాడు. పర్వత ప్రాంతాలలో ముడి ఇంధనాన్ని వుపయోగించకుండా గాలి వత్తిడి పరికరాన్ని ఉపయోగించి నీటి పంపు ద్వారా నీటిని పైకి తీసుకువచ్చే విధానాన్ని రూపొందించాడు. ఒకసారి తన తోటలో హోస్‌పైప్‌తో చెట్లకు నీరు పెడుతూ వుండగా ఆ పైపు క్రిందపడి నీటి వత్తిడికి

భూమిలోకి దాదాపు 30 సెం.మీ. గొయ్యిలా ఏర్పడింది. అతనికి వెంటనే నీటి ఒత్తిడిని ఉపయోగించడం ద్వారా వాననీటిని సేకరించి నిల్వ చేయవచ్చుననే ఆలోచన వచ్చింది. వెంటనే దానికి రూపకల్పన చేశాడు. ఈ పద్ధతి ద్వారా రేకులమీదినుంచి కిందకు పడే వాన నీటిని ఒక తొట్టిలో నిల్వ చేస్తారు. పి.వి.సి. వుపులతో ఆ నీటిని బావిలోకి సముద్ర మట్టంకంటే దిగువకు పంపిస్తారు. అలా పంపిన నీరు భూమిలోని నీటితో కలిసిపోతుంది. అవసరమైనపుడు ఆ బావినుండి శుద్ధమైన నీటిని వెలికి తీస్తారు.

కేరళలో టి.వి. ప్రసార కేంద్రాలు లేని 1970లలోనే సొంతంగా టి.వి.ని తయారు చేసి పరీక్షించాడు ఆంటోజి. 1988లో నీటిశుద్ధి యంత్రాన్ని రూపొందించారు. ఇది ఔషధ మొక్కలలో శీఘ్రగతిని పెరిగే కొన్ని భాగాలను సేకరించడానికి కూడా ఉపయోగపడుతుంది.

“కొత్తదనం అనేది పరిశోధకులకు ఖచ్చితంగా ఎంతో తృప్తినిస్తుంది. ఎన్ని కష్ట నష్టాలు ఎదురైనా పరిశోధకులు సృజనాత్మక దిశలో నిరంతరం ప్రయాణిస్తూనే ఉండాలి” అంటాడు ఆంటోజి.

## నీళ్ళు వేడిచేసే బయోగీజర్ :



ఉన్నత పాఠశాలలో పనిచేసే 52 సంవత్సరాల అరుణ్ కుమార్ కాంభోజ్‌కు వ్యవసాయదారునిగా సుమారు 30 సంవత్సరాలకు పైగా అనుభవం వుంది. తక్కువ సమయంలో ఆర్గానిక్ ప్రాక్టీస్‌లో స్థానికంగా ఎంతో నిపుణుడయ్యాడు. ఒకరోజు సాయం సమయంలో తన పొలంలో పనిచేస్తూ ఉండగా పశువుల ఎరువుకుప్పనుండి ఆవిరి బయటకు రావడం గమనించాడు. ఆ ఎరువుకుప్పను తాకి చూచి వ్యర్థమూల పదార్థాలు కూడా తగినంత వేడిని ఉత్పత్తి చేస్తాయని తెలుసుకున్నాడు. దీనిని ఉపయోగించి నీటిని లేదా కొన్ని ఇతర వస్తువులను పదార్థాలను వేడి చేసుకోవచ్చు అని అనుకొన్నాడు. ఎన్నో ప్రయత్నాల తర్వాత వృధాగా పడివున్న అవశేషాలు కుళ్ళిపోయే సమయాన వెలువడే ఉష్ణాన్ని ఉపయోగించి నీటిని వేడిచేసే పద్ధతిని కనుగొన్నాడు. వ్యర్థ పదార్థాల కుప్ప ద్వారా వెళ్ళే ఒక గొట్టం ద్వారా నీటిని పంపడంతో ఆ నీరు సుమారు 60-70 సెల్సియస్ వరకు వేడి అవుతున్నాయి. దీనిని తన తండ్రికి అంకితం ఇచ్చాడు. దీనిపేరు “చందన్ బయోగీజర్”గా పిలుస్తారు. తన గ్రామంలో సహజమైన వ్యర్థ పదార్థాలను ఉపయోగించి సాగు చేసే విధానానికి రూపకల్పన చేయాలని ఆరాట పడుతున్నాడు. అది చూసి ప్రభుత్వం వారు అనేక గ్రామాభివృద్ధి కార్యక్రమాలు జరపటానికి ముందుకు వచ్చారు. దాని ఫలితంగా 2000 సంవత్సరంలో ఆ గ్రామం ఒక ఆదర్శ గ్రామంగా తయారైంది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం వారు దీనిని “జైవిక్ గ్రామం”గా ప్రకటించారు.

## మురికినీరు / పారే నీటిద్వారా విద్యుదుత్పత్తి :



ప్రాథమిక పాఠశాలలో పనిచేసే 45 సంవత్సరాల కె. బాలకృష్ణ ఒక కాంట్రాక్టరు. తన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను, కష్టనష్టాలను ఎదుర్కొని పైకి వచ్చాడు. స్థానిక క్వారీలో పనిచేస్తున్నపుడు తిరిగే చక్రాన్ని ఉపయోగించి కరెంటు ఉత్పత్తి చేసే సాంకేతిక పద్ధతిని గమనించాడు. తమిళనాడులో సునామి కారణంగా





ధ్వంసమైన ప్రదేశాలను చూసినపుడు నీటియొక్క అత్యధిక శక్తిని తెలుసుకున్నాడు. నెమ్మదిగా పారే నీటినుంచి శక్తిని పుట్టించవచ్చని తెలుసుకున్నాడు. నెమ్మదిగా కదిలే మురికినీటినిగాని, ఏ ఇతర నీటి ప్రవాహాన్ని గాని ఒక స్థూపాకార పాత్ర ద్వారా ప్రవహింపజేసి, శక్తిని ఉత్పత్తి చేసే పద్ధతిని కనుగొన్నాడు. స్థూపాకార పాత్రలో అమర్చబడిన తీగ చుట్టివున్న బ్లేడ్లు వేగంగా తిరుగుతూ విద్యుత్తును ఉత్పత్తి చేస్తాయి. ప్రస్తుతం నడుస్తున్న విభాగం 30 కె.వి. శక్తిని ఉత్పత్తి చేస్తుంది. బాలకృష్ణ 2008లో తన నమూనా హక్కుల (పేటెంట్) కోసం దాఖలు చేసుకున్నాడు.

## గృహోపకరణ మరియు సాధారణ ప్రయోజనాలకు ఉపయోగపడే సీలింగ్ కూలర్లు :



ఉన్నత పాఠశాలలో పనిచేసే 46 సంవత్సరాల గోపాల్ కుమార్ సుల్జా ఎయిర్ కండిషన్ కొనే స్థోమత లేని మధ్యతరగతి మరియు అంతకన్నా దిగువ స్థాయి ప్రజానీకం సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించాడు. గదులలో మొత్తానికి గాలినిచ్చే సీలింగ్ ఫ్యాన్‌ను అభివృద్ధి చేస్తూ ప్రత్యేకమైన



సీలింగ్ కూలర్‌ను కనుగొన్నాడు. ఈ పరికరం యొక్క పనితనాన్ని మరియు ఉపయోగాన్ని రాష్ట్ర ఎలక్ట్రానిక్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్ ట్రస్ట్ మరియు డెవలప్‌మెంట్ సెంటర్, హర్యానా వారు అలాగే యం.యన్.ఐ.టి. వారు పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రయోగాల ఫలితంగా ఈ సీలింగ్ కూలర్ వేడిమిని 2.0 డిగ్రీల నుండి 5.25 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు తగ్గిస్తుందని నిర్ధారించారు. దీనిపై హక్కులకోసం గోపాల్ కుమార్ సుల్జా తరపున 2008లో జాతీయ పరిశోధనా సంస్థ (ఎన్.ఐ.ఎఫ్.) దరఖాస్తు దాఖలు చేశారు.

## నీటిలో తేలే సబ్బు :

ఉన్నత పాఠశాలలో పనిచేసే 52 సంవత్సరాల సి.ఎ. విన్సెంట్ సబ్బులను తయారు చేసే పరిశోధకులు ఇతను పిన్న



వయస్సునుండే సబ్బుల తయారీలో నాన్నకు సహకరించేవాడు. నదులలో, కొలనులలో, కాల్వలలో స్నానం చేసేటపుడు సబ్బు రుద్దుకుంటూ వుంటే చాలాసార్లు చేతిలోనుండి సబ్బు జారిపోయి నీళ్ళలో పడి మునిగి కరిగిపోతూ వుండే విషయాన్ని గమనిస్తూ వుంటాం. నీటిలో తేలే సబ్బును తయారు చేయడానికి సుమారు 14 సంవత్సరాలుగా తన సబ్బుల తయారీ కర్మాగారంలో పరిశోధనలు చేయసాగాడు. తన పరిశోదనల పట్ల తనదగ్గరి బంధువులు సైతం అసహనం ప్రదర్శించడంతో ఒక అద్దె ఇల్లు తీసుకొని తన పరిశోధనలు కొనసాగించసాగాడు. చివరికి నీటిలో తేలియాడే సబ్బును రూపొందించి, ఆ హక్కుల కోసం దాఖలు చేసుకున్నాడు. తన అపార అనుభవంతో విన్సెంట్ ఇలా అంటాడు "ప్రతి పరిశోధనలో అడ్డంకులు ఎదురవుతాయి. ఈ ప్రయోజనాలను, అడ్డంకులను అధిగమించడానికి ప్రతి ఒక్కరూ దృఢచిత్తంతో పనిచేయాలి".

# విద్యార్థుల ఆలోచనలు


## తనంత తానుగా బాత్‌రూంను శుభ్రపరిచే పరికరం :



ఆదర్శ్ మరియు సురేష్ అనే ఇరువురు విద్యార్థులు రోజూ మనం ఎదుర్కొంటున్న సమస్యల నుంచి బయటపడే మార్గాను వాటికి పరిష్కారాలను ఆలోచించేవారు. పబ్లిక్ బాత్‌రూంలు, టాయ్‌లెట్లని ఉపయోగించుకొని సరిగ్గా నీటిని పోయకపోవడంతో ఆ బాత్‌రూంలు ఎప్పుడూ మురికిగా దుర్గంధంతో ఉండటాన్ని వారు గమనించారు. వారి సూచన మేరకు టాయ్‌లెట్లలో అమర్చిన బ్రష్‌లు టాయ్‌లెట్స్‌ను చక్కగా శుభ్రపరుస్తున్నాయి.

## చెవిటి మరియు మూగవారికోసం రూపొందించబడిన బోర్డ్ :

17 సంవత్సరాల కుందన్ కుమార్ ఐ.ఐ.టి. విద్యార్థి. శాస్త్రవేత్త కావాలని ఎప్పుడూ కలలు కనేవాడు. ఎప్పటికప్పుడు



క్రొత్తగా ఆలోచించడానికి ఇష్టపడేవాడు. ఇందుకు నిదర్శనం తాను వ్రాసిన రెండు వందల పైగా క్రొత్త ఆలోచనలతో నిండిన ఏడు పుస్తకాలే. చెవిటి మరియు మూగవారు ఇతరులతో లేదా తమలో తాము సునాయాసంగా సంప్రదించుకునే విధంగా చిన్న బోర్డుమీద నెంబర్లు, అక్షరాలు రోజూ వాడే సాధారణ పదాలు వ్రాసి వుంటాయి దీనిని వాడే వ్యక్తి దగ్గర టార్చిలైటు ఉంటుంది. ఆ టార్చిలైటును ఒక పదం, అక్షరం లేదా నెంబరుపై వేస్తాడు. దీనివల్ల చూసే వ్యక్తి లేదా వ్యక్తుల సమూహం సరైన అర్థం తెలుసుకో గలుగుతారు. గ్రుడ్డివాళ్ళకు బ్రెయిలీ లిపి వరమైనట్లు తన ఈ పరిశోధన ప్రతి మూగ, చెవిటి వారికి చెందాలి అనేదే కుందన్ చిరకాల వాంఛ.

## ఫ్యాను వేగాన్ని ఉష్ణోగ్రత ద్వారా నియంత్రించే సాధనము, అజూబ ట్యూబ్‌లైట్ ఫ్రేమ్ మొదలైనవి :




ప్రాథమిక పాఠశాలలో పనిచేసే 64 సంవత్సరాల నారాయణ దాస్ జిత్యాని పశ్చిమ బెంగాల్, సిలిగురిలో విద్యుత్ పరికరాల దుకాణం నడిపేవాడు. నారాయణదాస్ 18 సంవత్సరాల వయస్సులో ట్రాన్సిస్టర్ రేడియోలు తయారు చేసే కర్మాగారాన్ని ప్రారంభించాడు. నెల్కో రేడియోల డీలర్‌షిప్ తీసుకున్న తరువాత ప్రతిరోజూ నాలుగు గంటల సమయాన్ని కేటాయించి వైర్‌లెస్ ఎఫ్.ఎమ్. మైక్, పెన్ ఎఫ్.ఎమ్ మైక్, ఎక్కువ వేగంతో టేపును కాపీ చేసే కాపియర్లు మొదలైన విద్యుత్ ఉపకరణాలను కనుగొన్నాడు. రూములలో సీలింగ్ ఫ్యాన్ వేగంగా తిరుగుతుంటే రాత్రిపూట ఒక్కోసారి ఎక్కువ చలి అనిపించి ఫ్యాన్ వేగాన్ని తగ్గించాలి అనిపిస్తుంది. ఆ వేళప్పుడు మంచంపైనుండి లేచివెళ్ళి వేగాన్ని తగ్గించడం అనేది ఒకింత చిరాకుగా వుంటుంది. దీనికి ఒక పరిష్కారం చూడాలి అనుకున్నాడు నారాయణ దాస్. గది ఉష్ణోగ్రతను అనుసరించి తనంత తానుగా ఫ్యాన్ వేగాన్ని నియంత్రించే ఎలక్ట్రానిక్ విధానానికి రూపకల్పన చేశాడు. దీనిమూలంగా అర్థరాత్రి సమయంలో గాఢనిద్రలో వున్న వ్యక్తి లేచి వేగాన్ని నియంత్రించుకునే విధానం తప్పిపోయింది. సుఖంగా ప్రశాంతంగా నిద్రపోవడానికి ఇది దోహదకారి అయింది. అస్సాం, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్‌కు చెందిన అనేకమంది ఔత్సాహికులు ఈ ఎలక్ట్రానిక్ పరికరం ఉపయోగించేందుకు అమ్ముకునేందుకు తగు లైసెన్స్ పొందారు.

## అధిక ధ్వనినిచ్చే స్పీకర్లు :



58 సంవత్సరాల పక్కియ నాథన్ సౌండ్ సిస్టమ్ (ధ్వని పరికరాలు) అద్దెకు ఇచ్చే వ్యాపారి. ప్రస్తుతం ఉన్న స్పీకర్లు ఆశించినంత నాణ్యతతో కూడిన ధ్వనిని ఇవ్వటం లేదు అని గుర్తించాడు. వంటింట్లో పనిచేస్తూ ఉండగా ఒక రోజు పోపుల డబ్బాను గమనించాడు. ఒక పెద్ద డబ్బాలో మిరియాలు, పసుపు, కారం ఇతర పోపు దినుసులు నిల్వ ఉంచుకోవడానికి గుండ్రటి ఆకారంలో చిన్న చిన్న డబ్బాలు. ఇది ఆ పోపుల పెట్టె స్వరూపం. దీనిని చూసిన వెంటనే అతనికొక ఆలోచన వచ్చింది. స్పీకర్లను కూడా ఇలాగే అమర్చాలని నమూనా రూపకల్పనకు 2002లో శ్రీకారం చుట్టాడు. స్పీకర్లు పనిచేసే విధానం, వాటి డిజైను పట్ల ఎలాంటి పరిజ్ఞానం లేని పక్కియనాథన్ డ్రమటిక్ సౌండ్ ఎఫెక్ట్



వచ్చే విధంగా వృత్తాకారంలో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో స్పీకర్‌ను తయారు చేశాడు. ఈ స్పీకర్లు మంద్రంగా శ్రావ్యంగా ఒక భ్రమకు లోనుచేసే విధంగా చక్కని ఆహ్లాదకరమైన ధ్వనిని యిచ్చేవి. చక్కటి ధ్వనిని ఈ స్పీకర్లు అందిస్తాయి.

ఈ పరిశోధకుడు 2006 నవంబర్‌లో పెరంబలూరులో జరిగిన ఒక సభలో భారత ప్రభుత్వం ఐ.టి. శాఖామాత్యుల చేతులమీదుగా "కృషిరత్న" బిరుదు అందుకున్నాడు. ●

# మన ఔషధ మొక్కలు



- జట్టు ట్రస్టు సౌజన్యంతో....

మానవుడు తన ఆరోగ్యాన్ని కాపాడుకునే మార్గాలను వేలాది సంవత్సరాల నుండి అన్వేషిస్తూనే వున్నాడు. అటువంటి ప్రయత్నాల ఫలితమే మొక్కలను, వనమూలికలను మందులుగా వినియోగించుకోవడం.

భారతీయ మూలికా విజ్ఞానం ప్రపంచ ప్రసిద్ధి చెందినది. అది వేలాది ఏండ్ల కాలపరీక్షలను తట్టుకుని నిలిచిన విజ్ఞానం. కాని, గడచిన దశాబ్ద కాలంలో పల్లె ప్రజలు కూడా తమ పరిసరాలలోని ఔషధ మొక్కలను గుర్తించడం, ఉపయోగించడం క్రమంగా తగ్గిస్తున్నారు. ఈ పరిస్థితి ఎంతవరకు వచ్చిందంటే.... పట్టణాల్లోని ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులకు 'వేమ చెట్టు, రావి చెట్టు, చింత చెట్టు' ఇలాంటి కొన్ని తప్ప వేరే మొక్కల పేర్లుగాని, వృక్షాల పేర్లు కాని తెలియకుండా పిల్లల్ని పెంచుకుంటున్నాం. ఈ పరిస్థితి ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు కూడా పాకింది. వారికి చదువుతో పాటు పరిసర విజ్ఞానం కలిగించడం ఎంతైనా అవసరమన్న విషయాన్ని తల్లిదండ్రులు గుర్తించాలి. 'ఔషధ మొక్కల' విలువలను తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇలాంటి సమయంలో కొన్ని ముఖ్యమైన ఔషధ మొక్కలను వాటి బహుళ ప్రయోజనాలను నేటి తరానికి పునః పరిచయం చేయాలన్న ఉద్దేశ్యంతో 'జట్టు ట్రస్టు' వారి సౌజన్యంతో ఇక్కడ ప్రచురిస్తున్నాం.

**అడ్డరసం :**

**ఇతర పేర్లు :** వాసా, వసాక, అడ్డచెట్టు.

**దొరుకు చోటు :** పంట భూముల చుట్టూ, ఉద్యాన వనలలోను

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, వ్రేళ్ళు, పూవులు.

**మొక్క ఆకారము :** 1-4 మీటర్ల ఎత్తు పెరుగు బహువార్షికపు మొక్క.

**ఆకులు :** కణుపుకు రెండు చొప్పున అండాకారంలో ఉంటాయి.

**పూలు :** తెల్లగా కంకులవలె కొమ్మల చివర వస్తాయి.

**ఫలాలు :** కుంభాకార కటకంలా వుండి, ఎండిన పిదప తడి తగలగానే నిలువుగా పగిలిపోతాయి.

**ఉపయోగాలు :** ఆకులను నిప్పుమీద వేడి చేస్తే రసం వస్తుంది. ఆకులను చిన్న ముక్కలుగా తరిమి నీళ్ళలో వేసి కషాయం కాచి, 20 మిల్లీ లీటర్లు ప్రతిరోజూ ఉదయం త్రాగితే 40 రోజులకు వుబ్బసం నుండి ఉపశమనం కలుగుతుంది.

శరీరంలో రక్తస్రావం ఎక్కడ జరుగుతున్నా ఈ కషాయంతో కడగడం, లోపలకు ఇవ్వడం వలన స్రావాలు





ఆగుతాయి. ఉబ్బసం, దగ్గు, క్షయ, ఊపిరితిత్తులకు సంబంధించిన అన్ని వ్యాధులకు మంచి మందు.

దీని పూలను నీడలో ఆరనిచ్చి తగినంత బెల్లంతో కలిపి ముద్దచేసి రోజుకు 5 గ్రాముల చొప్పున తింటే కడుపులో మంట, అల్సర్లు పూర్తిగా తగ్గుతాయి. మొలల్లో వచ్చే రక్తస్రావాన్ని పూలు తగ్గిస్తాయి. వేరు ముద్దను శరీరంపై పూసుకుంటే ఒంటి నొప్పులు తగ్గుతాయి. వ్రేళ్ళనూ, బెరడునూ, ఆకులను సమతూకంలో తీసుకొని ముద్దచేసి వాపుగల ప్రాంతంలో పూర్తే (రూమాటిజమ్) కీళ్ళు, కండరాల నొప్పుల నుండి ఉపశమనం కలుగుతుంది.

## అరటి

**ఇతర పేర్లు :** కదళీ, అరటి

**దొరుకు చోటు :** పెరడులలో పెంచుతారు, తోటలు కూడా పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** కాయలు, పండ్లు, దుంప కాండం.

**మొక్క ఆకారము :** 3 మీటర్ల ఎత్తు వరకు పెరిగే ఏకవార్షికపు మొక్క అరటి తెలియని ఆంధ్రుడుండడు.

**ఆకులు :** సమాంతర ఈనెల వ్యాపనంతో 2 మీటర్ల పొడవుంటాయి

**పూలు :** ఎర్రగా ఉంటాయి

**ఉపయోగాలు :** అరటి కాయను, నిప్పు ఆరిన నివురులోనుంచితే, తోలు కాలిపోకుండా మెత్తగా అవుతుంది. దాని గుజ్జును చక్కెరతో కలిపి తింటే కడుపులో అల్సర్లు తగ్గుతాయి.

పై గుజ్జును చక్కెర కలపకుండా ప్రతిరోజూ తీసుకుంటే బరువు, లావు తగ్గుతుంది.

అరటి దుంపరసం ప్రతిరోజూ 50 మి.లీ. సేవిస్తే మూత్రంలో వచ్చే రాళ్ళు తొలగిపోయి ఉపశమనం కలుగుతుంది. నిద్రపడుతుంది. రక్తంలో చేరిన పలు రకాల విషపదార్థాలను పోగొడుతుంది.

దుంపను శుభ్రం చేసి, ఎండబెట్టి, కాల్చి బూడిద చేసి తగు మోతాదులో సేవిస్తే జ్వరాలను పోగొట్టి, మూత్రం సాఫీగా అయ్యేటట్లు చేస్తుంది.

అరటిపండ్లు పేదల పాలిట ఆపిల్‌పండు, తిన్న వెంటనే శక్తిని బరువును సమకూరుస్తుంది.

అరటి ఆకు బూడిద, కెల్లను గురకను పోగొడుతుంది.

**అల్లం**

**ఇతర పేర్లు :** శొంఠి, ఆర్ద్రక, శుంఠీ

**సవర :** సింగేర్

**జాతాపు :** అల్లం

**మొక్క ఆకారం :** ఒక మీటరు ఎత్తు వరకు పెరిగే బహు వార్షికపు మొక్క. ప్రతి సంవత్సరం వేరు దుంప నుండి కొత్త శాఖలు వస్తాయి.

**ఆకులు :** పసుపు మొక్క ఆకులవలెనే ఉంటాయి.

**పుష్పాలు :** పసుపు పచ్చగా, ఒక ఆకర్షణ పత్రం ఎర్రగా నిడుపాటికంకి వలె వస్తాయి.

**ఉపయోగాలు :** అల్లం అరుచిని, పైత్యాన్ని పోగొట్టి ఆకలి పుట్టిస్తుంది. అల్లం చన్నీళ్ళతో శుభ్రపరచి సన్న చిన్న ముక్కలుగా కోసి ఒకరోజు నీడలో ఆరనివ్వాలి. 100 గ్రా. అల్లపు ముక్కలకు 10 గ్రాముల సైందవ లవణ చూర్ణం కలిపి, ఆ మొత్తం మునిగేంత వరకు నిమ్మపండ్ల రసం గాని, మాదీఫల రసంగాని పోయాలి.



రెండు రోజులు నీడలో ఆరబెట్టిన తరువాత ఎండలో ఎండనివ్వాలి. రసం పూర్తిగా ఇగిరిపోయి అల్లం ముక్కలుగా ఎండిపోయిన తర్వాత గాలి చొరని సీసాలో భద్రపరచుకోవాలి. దీన్ని రోజూ 2–3 గ్రాములు సేవించినచో ఆకలి లేకపోవటం, తిన్నది అరగక పోవటం, అరుచి, పైత్యం, వికారం, కళ్ళు తిరగటం, తల తిప్పటం వంటి బాధలన్నీ హరించుకు పోతాయి. ఆయాసం, దగ్గు తగ్గుతుంది. గ్యాస్ ట్రబుల్ కూడా తగ్గుతుంది. ఒకేసారి ముక్కను నమిలి మ్రింగరాదు.

**అవిశ**

**ఇతర పేర్లు :** అగసి, అవిసి, అగస్త్య

**దొరుకు చోటు :** తమలపాకు, చెఱకు తోటల్లో పెంచుతారు.

**ఉపయోగపడు భాగాలు :** ఆకులు, మాను బెరడు, పూలు.

**మొక్క ఆకారము :** 8 మీటర్ల ఎత్తు వరకు పెరిగే చిన్న చెట్టు.

**ఆకులు :** పత్రాలు దీర్ఘ చతురస్రాకారంలో ఉంటాయి.

**పూలు :** పెద్దవిగా తెల్లగా లేదా ఎర్రగా గుత్తులు గుత్తులుగా వుంటాయి. ఫలాలు కాడవలె సన్నగా పొడవుగా ఉంటాయి.

**ఉపయోగాలు :** మాను బెరడు కషాయం జ్వరాన్ని పోగొడుతుంది. ఆకులు క్షీరవర్ధకాలు. మూత్రాశయంలోని రాళ్ళను కలిగిస్తాయి. పూలు రేచీకటిని తొలగదీస్తాయి. సాఫీగా విరోచనం అవుతుంది. దీని ఆకుల రసాన్ని కొద్దిగా గుల్ల సున్నము చేర్చి పట్టించినట్టయితే



గవదల వాపులు, నొప్పులు హరించుకుపోతాయి. ఆకులు లేదా పూల రసం పూటకు 5 గ్రాముల చొప్పున రెండు పూటలా 20 రోజుల పాటు సేవిస్తే పైత్య వికారము, ఉబ్బస వ్యాధి, దగ్గులు, క్రిమి దోషము, కఫ రోగాలు తొలగిపోతాయి.

## ఉత్తరేణి

**ఇతర పేర్లు :** కుక్కురదంతి, అపామార్గ, దుచ్చెన, వజ్రదంతి

**దొరుకు చోటు :** ఆంధ్రప్రదేశ్ అంతటా, ఖాళీ ప్రదేశాలలో వుంటాయి.

**ఉపయోగపడు భాగాలు :** మొక్కలోని అన్ని భాగాలు

**మొక్క ఆకారము :** బహువార్షికము, తుప్పలా పెరుగుతుంది, కొమ్మలు ఒక మీటరు వరకు పెరిగి వంగి ఉంటాయి.

**ఆకులు :** కణుపుకు ఒకటి చొప్పున అండాకారంలో ఉంటాయి.

**పూలు :** అతి చిన్నవిగా లేత ఆకుపచ్చ రంగులో, ములుకుల వంటి రక్షక పత్రాలతో, కంకివలె కొమ్మల చివర వస్తాయి.

**ఉపయోగాలు :** ఉత్తరేణి ఉదర రోగాలకు ఉపయోగపడుతుంది. గింజలు వీర్యవృద్ధినిస్తాయి. ఆకలి కలుగనీయవు. ఉత్తరేణి మొక్కను సమూలంగా తీసుకొని, శుభ్రపరచి నలగగొట్టి, ముద్దచేసి ఎండబెట్టాలి. బాగా ఎండిన దానిని శుభ్రమైన కుండలో పెట్టి, మూతవేసి నిప్పులపై పెట్టి బూడిదగా మారేవరకు మండించగా వచ్చే తెల్లని బూడిదను ప్రతిరోజూ ఉదయం, రాత్రిపూట అరచెంచాడు తేనెతో కలిపి తీసుకుంటే "లావు" తగ్గుతాయి.



ఈ బూడిదను నువ్వుల నూనెతో కలిపి కాలిపగుళ్ళకు రాస్తే ఉపశమనం కలుగుతుంది. ఉత్తరేణి కాండంతో దంతాధావనం చేస్తే పండ్ల కుదుళ్ళు గట్టిపడతాయి. ఇది తేలుకాటుకు మంచి మందు.

## ఉల్లి

**ఇతర పేర్లు :** నీరుల్లి, పలాండు

**దొరుకు చోటు :** దేశమంతటా పండిస్తారు.

**ఉపయోగపడు భాగాలు :** సమూలంగా

**మొక్క ఆకారము :** కొమ్మలుండవు, ఉల్లిపాయనుండి వ్రేళ్ళు వచ్చే భాగమే నిజమైన కాండము. మిగిలినదంతా ఆకులు.

**ఆకులు :** ఒకదానిపై ఒకటి బోలుగా కప్పబడటం వలన గుండ్రని ఆకారం వచ్చేస్తుంది.






**పూలు :** తెల్లగా ఉండి, కాడ చివరి బంతిలా వస్తాయి.

**ఉపయోగాలు :** ఉల్లి చేసినమేలు తల్లి అయినా చేయదు అంటారు. క్రిములను పోగొడుతుంది. వీర్యవృద్ధి కలిగిస్తుంది, చలువ చేస్తుంది. గుండెను వుత్తేజ పరుస్తుంది. గుండె కొట్టుకోవడాన్ని పెంచుతుంది. కడుపులోని ప్రేవులను, సున్నితమైన కండరాలను ప్రేరేపిస్తుంది. పైత్యరసము ఊరేటట్లు చేస్తుంది. మధుమేహాన్ని అదుపులో వుంచుతుంది. కడుపులో అధికంగా తయారైన వాయువులను తొలగిస్తుంది. విరేచనముల నుండి ఉపశమనాన్ని కల్గిస్తుంది. మూత్రం సాఫీగా విడుదల అయ్యేటట్లు చేస్తుంది.

**(వచ్చే సంచికలో మరికొన్ని ఔషధ మొక్కల గురించి..**

# గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక




## పల్లెజ్ఞానాన్ని వ్యాపింపజేద్దాం - పల్లెసృజన ను బహూకరిద్దాం

### మీవాళ్ళకు మీరిచ్చే అత్యుత్తమ బహుమతి పల్లెసృజన

- మీ నాన్నగారి పుట్టినరోజా?
- మీ స్నేహితుడి పెళ్ళా?
- మీ చిరంజీవి బర్త్‌డేనా?
- మీ సహోద్యోగి రిటైరవుతున్నారా?
- మీ పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారా?
- మీ పెళ్ళిరోజా?

పెళ్ళైనా, పండగైనా, స్కూళ్ళు కాలేజిలో చేరినా..... సందర్భం ఏదైనా ఆచారం సాంప్రదాయం ప్రకారం ప్రతి సందర్భంలో ఓ బహుమతి ఇవ్వాలి.... దానికెంత ఖర్చు చేయాలి?.... అసలు బహుమతి ఏమివ్వాలి?... అనేది ఎప్పుడూ ఓ పెద్ద సమస్యే....

- ఇచ్చిన బహుమతి ఆ సందర్భంలోనే ఆనందాన్ని పంచేదిగా కాకుండా...
- అందరూ ఇచ్చిన దానికన్నా భిన్నంగా ....
- జ్ఞానాన్ని, విజ్ఞానాన్ని పంచేదిగా ఉండాలంటే.....?

ఇచ్చినవారికే కాక, నలుగురికీ పనికి వచ్చే విధంగా ఉండాలి. మీరో పదిమంది మిత్రులకు కాని, శ్రేయోభిలాషులకు గాని పల్లెసృజన పత్రికను 'గిఫ్ట్'గా ఇవ్వాలంటే వారి పేరు, అడ్రస్‌ను వ్రాసి, రూ. 1,500/-లను పంపితే మీరు పంపిన చిరునామాలకు మీ గిఫ్ట్‌గా, మీ పేరున వారికి పంపుతాం. అంటే మీరు ఒక సంవత్సరం పాటు వారికి గిఫ్ట్ ఇచ్చినట్లవుతుంది. ప్రతి సంచిక వచ్చినప్పుడల్లా మమ్మిల్ని జ్ఞాపకం చేసుకుంటారు.

పల్లెసృజన పత్రిక మన పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో దాగున్న విజ్ఞాన సంపదని వెలికి తీసి ప్రస్తుత నవ సమాజానికి ఉపయోగపడే విధంగా చేయటానికి పాటుపడుతోంది.

మీరు బహుమతి ఇవ్వదలచుకున్న ప్రతి సందర్భంలో తడుముకోవలసిన అవసరం లేకుండా ఇవ్వదలచుకున్న వారి పేరు, పూర్తి చిరునామాలతో పాటు ఎంతమందికి బహుమతి ఇవ్వాలనుకున్నారో అన్ని రూ. 150/-లు మాకు పంపిస్తే మేము మీ తరుపున వారికి ఒక సంవత్సరం పాటు పల్లెసృజన పత్రికను పంపుతాం.

- ఎడిటర్

# ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్ (ఓపియస్‌డిహెచ్)

# ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి

## పెరిగిపోతున్న నగరాలు – తరిగిపోతున్న ఆరోగ్యం

2010 సంవత్సరపు ప్రపంచ ఆరోగ్యదినం సందేశం – పట్టణీకరణ మరియు ఆరోగ్యం – ప్రపంచవ్యాప్తంగా పట్టణాల్లో 300 కోట్ల ప్రజలు జీవిస్తున్నారు. అంటే దాదాపు ప్రపంచ జనాభాలో సగమంది.

**పట్టణీకరణ వల్ల :**

- జనాభా పెరిగి ఆహారం, నీరు, గాలి కలుష్యమవుతుంది.
- అంటువ్యాధులు ఎక్కువవుతాయి.
- పెరిగిపోతున్న వాహనాలు, పరిశ్రమలు ప్రమాదాలను పెంచుతాయి.
- లోపించిన ప్రేమానురాగాలు మానసిక వ్యాధులను కలిగిస్తాయి.
- మద్యపానం, మత్తుమందుల వాడకం, పేకాట, వ్యభిచారం, బాలనేరాలు, నిరుద్యోగం, పేదరికం, ఆర్థిక అసమానతలు, బాలకార్మికులు, యాచకులు పెరిగి సామాజిక అనారోగ్యం పెరుగుతుంది.

**ఆరోగ్యకరమైన నగర జీవితానికి :**

- పనరులు పరిమితంగా వాడుకోవాలి.
- వ్యక్తిగత వాహనాలు తగ్గించుకొని, సైకిలు వాడకాన్ని పెంచుకోవాలి.
- పరిసరాలను పాడుచేయరాదు.
- ప్రజా రవాణా వ్యవస్థను పెంపొందించుకోవాలి.
- పారిశ్రామికవేత్తలు లాభాల కొరకు పట్టణాలను పాడు చేయరాదు.
- గ్రామీణులు పట్టణాలపై వ్యామోహం పెంచుకోరాదు.

**మూడు అంశాలను పాటించండి -**
**పదమూడు వ్యాధులు నిరోధించండి**

- ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం మనదేశంలో ప్రతియేటా 7 లక్షల 80 వేల మంది 1. కలుషిత నీరు, 2. పారిశుధ్య లోపం మరియు 3. వ్యక్తిగత అపరిశుభ్రత కారణంగా మరణిస్తున్నారు.
- మనదేశంలో 15 శాతం మంది ఈ మూడు కారణాల వల్లనే వ్యాధుల భారిన పడుతున్నారు.
- మీరు క్రింది మూడు అంశాలను పాటించండి. పై మూడు కారణాల వల్ల వచ్చే పదమూడు వ్యాధులను నిరోధించండి.

1. బాగా కాచి, చల్లార్చిన నీరు త్రాగండి. నీరు మరుగుట మొదలైనప్పటినుంచి 15 నిముషాలు కాచండి. ఏ పాత్రలో కాచుతారో అదే పాత్రలో చల్లారనీయండి. అవసరమనుకుంటే కాచేముందు వడగట్టండి.
2. ఆహారం తినేముందు మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు మరియు నీటితో కడగండి. ఆహారం తినేముందు చేతులు కడుక్కున్న తర్వాత ఎలాంటి బట్టతో తుడవకూడదు. ఈ చర్యల వల్ల 1) నీళ్ళ విరేచనాలు, 2) చీము – రక్త విరేచనాలు, 3) అమీబియాసిస్, 4) కలరా, 5) టైఫాయిడ్, 6) కొన్ని రకాల పచ్చకామెర్లు, 7) నులి పురుగుల వ్యాధి, 8) పోలియో చాలావరకు నిరోధించవచ్చు.
3. దోమతెరలు వాడండి. మీరు 9) మలేరియా, 10) మెదడు వాపు, 11) డెంగీ జ్వరం, 12) చికున్ గున్యా, 13) ఫైలేరియా (బోధ వ్యాధి) చాలావరకు నిరోధించవచ్చు.

ఈ అంశాలను మీ స్నేహితులతో, బంధువులతో, సహచరులతో మాట్లాడండి.

**– సదా మీ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ – ఓపియస్‌డిహెచ్.**

గతంలో ఈ శీర్షికలో చెప్పిన విధంగా ఎవరైనా 'ఆరోగ్యాన్ని గురించి మాట్లాడండి' హెల్త్ బోర్డులను నిర్వహించవలసిందిగా ఒంపియస్‌డిహెచ్ నిర్వాహకులు డా. అరవీటి రామయోగయ్య గారు కోరినట్లుగా పాఠకులు ఎవరైనా ఈ బోర్డులను నిర్వహిస్తున్నట్లయితే వీటి నిర్వహణలో మీరు పొందే అనుభూతులను తెలియజేయవలసిందిగా కోరుచున్నారు. ఆరోగ్యకాంతులు వెదజల్లడంలో మీకు, మీ హెల్త్ బోర్డుకు విజయాన్ని కాంక్షిస్తున్నారు. హెల్త్‌బోర్డు నిర్వహించదలచినవారు శ్రీ రామయోగయ్య గారి క్రింది చిరునామాపై సంప్రదించగలరు :

**డా. అరవీటి రామయోగయ్య గారు**
**ఆర్గనైజేషన్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ సోషియల్ డైమెన్షన్స్ ఆఫ్ హెల్త్,**
**6-101, న్యూమల్లార్, సహారా స్టేట్స్, మన్సూరాబాద్,**
**ఎల్.బి.నగర్, హైదరాబాద్ – 500 068.**
**సెల్ ఫోన్ : 98496 69282.**

Creative Minds
*Leading Innovation....*

# A Grassroot Innovation

National Innovation Foundation



గ్రామీణశాస్త్రవేత్త
## బ్రహ్మం హరిత ఇస్త్రీ పెట్టె
**రజకులకు ఓ వరం**

* సమయం వృధా కాదు
* ఎక్కువ పనితనం
* అత్యంత నమ్మకమైనది
* ఎక్కువకాలం మన్నేది
* సమానమైన వేడి
* తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం

**పూర్తి వివరాలకై సంప్రదించండి :**
**M/s Creative Minds**
1-1-336/64, Vivek Nagar Colony,
Chikkadpally, Hyderabad - 500 020.
Tele Fax: 040-27665655
E-mail : creativemindsap@gmail.com
visit at : www. pallesrujana.org





రజకుల జీవితాల్లో
ఓ విప్లవాత్మకమైన మార్పు

### బ్రహ్మం హరిత ఇస్త్రీ పెట్టె

ప్రస్తుతం రజకులు వాడే బొగ్గును ఉపయోగించే ఇస్త్రీ పెట్టెతో పనిచేయటం చాలా శ్రమతో కూడుకున్న పని. ఆంధ్రప్రదేశ్‌లోని వరంగల్ జిల్లా నర్సంపేట గ్రామానికి చెందిన శ్రీ కె. లింగబ్రహ్మం గ్యాస్‌తో నడిచే ఇస్త్రీ పెట్టెను కనుగొన్నారు.

- రజకులు వాడుకోవడానికి ఈ ఇస్త్రీ పెట్టె దృఢంగా, బరువుగా, మన్నికగా ఉండేలా రూపొందించబడింది.
- బొగ్గుల ఇస్త్రీపెట్టెలో బొగ్గులను వెలిగించడం, చల్లార్చడంలో చాలా కాలయాపన అవుతోంది. కానీ, ఇందులో ఒక స్విచ్ సహాయంలో ఆన్ / ఆఫ్ చేయవచ్చు. సిలిండర్ నుంచి ఇస్త్రీ పెట్టెలోనికి గ్యాస్ సప్లై చేయడానికి ఒక ట్యూబు అమర్చబడింది.
- గ్యాస్ ఇస్త్రీ పెట్టె వాడటం సులభతరం మాత్రమే కాక, పొదుపు కూడా. రజకులు దీనిని వాడటానికి అత్యుత్సాహం చూపటానికి కారణం దీంతో కష్ట పడవలసిన అవసరం లేదు. బొగ్గు వాడకం వలన వచ్చే ఇబ్బందులూ లేవు. దీనిలో అరుగు, తరుగులుండవు. పెట్టెను కాని, విడి భాగాలను కానీ మాటి మాటికీ మార్చవలసిన అవసరం లేదు.

| బొగ్గుల ఇస్త్రీ పెట్టెకు - గ్యాస్ ఇస్త్రీ పెట్టెల మధ్యగల తేడాలు | |
|---|---|
| బొగ్గుల ఇస్త్రీ పెట్టె | గ్యాస్ ఇస్త్రీ పెట్టె |
| రోజుకు బొగ్గు వాడకం (8 గంటలకు)-5 కిలోలు<br>రోజుకు బొగ్గు ఖర్చు (రూ. 16/-లకు కిలో) : రూ. 80/-<br>ప్రతి 15 నెలలకు ఇస్త్రీ పెట్టె మార్చటానికి అయ్యే ఖర్చు రూ. 2,800/-<br>10 సంవత్సరాలకు : రూ. 16,800/- | గ్యాస్ వాడకం రోజుకు (8 గం.లకు) 500 గ్రా.<br>రోజుకు గ్యాస్ ఖర్చు (కిలో రూ. 70/-) : రూ. 35/- (రోజుకు రూ. 45/-ల ఆదా)<br>10 సంవత్సరాల వరకు దీన్ని మార్చవలసిన అవసరం లేదు కనుక ఖర్చు లేదు. |

**వివరాలు:**
బరువు 8 కిలోలు
పొడవు 32 సెం.మీ.
ఎత్తు (చెక్క హ్యాండిల్‌తో కలిపి) 22. సెం.మీ.
**విడి భాగాలు:** 5 మీ. పొడవు గల పైపు.
**సూచన:** సిలిండర్, రెగ్యులేటర్ ఇస్త్రీ పెట్టెతో ఇవ్వబడవు.
**వారంటీ:** ఒక సంవత్సరం.

**ఇతర లాభాలు:**

- మాటి మాటికీ బొగ్గు మార్చనవసరం లేదు కనుక సమయం ఆదా అవుతుంది.
- బొగ్గు ఇస్త్రీ పెట్టెలో లాగా కాక, ఎప్పుడు కావాలంటే అప్పుడు వాడుకోవచ్చు కనుక వేడి వృధా కాదు.
- ఇస్త్రీ చేసే వారికి వేడి అనిపించదు.
- నిప్పు రవ్వల వలన బట్టలు కాలే ప్రమాదం, చిల్లులు ప్రమాదం లేదు.
- గ్యాస్‌తో పనిచేసే ఇస్త్రీ పెట్టెతో ఎక్కువ బట్టలు ఇస్త్రీ చేయవచ్చు. (చేసినవారి అనుభవంతో)
- బొగ్గు మార్చటానికి రోజుకు కనీసం రెండున్నర గంటల సమయం వృధా అవుతుంది. ఇందులో అవసరం లేదు అంటే రోజుకు రెండున్నర గంటల సమయం కలిసి వస్తుంది.
- బొగ్గు ఇస్త్రీ పెట్టెలో లాగా కాక, ఇందులో బట్ట రకం బట్టి వేడిని మార్చుకోవచ్చు.
- దీనివలన ఒకేరకం, నాణ్యమైన ఇస్త్రీ చేయవచ్చు.
- బొగ్గు ఇస్త్రీ పెట్టె వాడితే ప్రతి 16 నెలలకు దాన్ని మార్చటానికి రూ. 2,800/- ఖర్చు చేయాలి.
- గ్యాస్ ఇస్త్రీ పెట్టె 10 సంవత్సరాలకు కూడా మార్చవలసిన అవసరం లేదు.
- రోజుకు రూ. 45/-ల ప్రకారం 3 కోట్ల మంది రజకులు దీనిని వాడటం వలన రోజుకు రూ. 175 కోట్లు దేశానికి ఆదా అయినట్లే. అంటే ఇది దేశంలో రజకులకు ఈమేరకు అదనపు ఆదాయం కలిగిస్తున్నాము.
- రోజుకు 1.5 లక్షల టన్నుల బొగ్గు ఆదా చేయటం వలన బొగ్గు తయారు చేయటానికి వాడే విలువైన కలపను ఆదా చేయవచ్చు.

# పల్లెసృజన


గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక


**పాత సంచికలు కావాలా?**

ఒక్కో సంచిక

**రూ. 20/-లు మాత్రమే!**



సంపుటి 1, సంచిక 1



సంపుటి 1, సంచిక 2


సంపుటి 1, సంచిక 3




సంపుటి 1, సంచిక 4



సంపుటి 2, సంచిక 1



సంపుటి 2, సంచిక 2


సంపుటి 2, సంచిక 3


సంపుటి 2, సంచిక 4



సంపుటి 3, సంచిక 1


సంపుటి 3, సంచిక 2


సంపుటి 3, సంచిక 3


సంపుటి 3, సంచిక 4


సంపుటి 4, సంచిక 1


సంపుటి 4, సంచిక 2



సంపుటి 4, సంచిక 3

## చందా వివరాలు

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| సంవత్సరానికి | 150/- | 1,500/- |
| రెండు సంవత్సరాలకి (ఒక పాత సంచిక ఉచితం) | 250/- | 2,500/- |
| మూడు సంవత్సరాలకి (రెండు పాత సంచికలు ఉచితం) | 375/- | 3,750/- |
| ఐదు సంవత్సరాలకు (నాలుగు పాత సంచికలు ఉచితం) | 650/- | 6,500/- |

పల్లెసృజన చందాదారులు కండి – పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి! చందాదారులుగా చేరాలనుకున్న వారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ. లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ – 500 094. ఫోన్ : 040–27118555, సెల్ : 9866001678
E-mail : honeybeeap@gmail.com

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి
మీ చిరునామాను స్పష్టంగా వ్రాసి మాకు పంపండి, లేదా యస్.యం.యస్. లేదా ఈ-మెయిల్ చేయండి.
M/s Aruna Ganesham, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
A/c No. 905 520 100 773 62

Narendra Graphics, Hyd. Ph. : 93913 75655